శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

క్రీడా మైదానాలకు పూర్వ వైభవం తీసుకొస్తా

నెల్లూరు, మార్చి 6,ప్రభాతవార్త-వైద్యం అన్ని పార్కులను ఆధునీకరించి పూర్వ వైభవం తీసుకొస్తున్నామని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. గురువారం నెల్లూరు నగరంలోని 5వ డివిజన్ సత్యనారాయణపురంలోని ఎస్వీఆర్ పార్కు 14 వ డివిజన్ ఏసీ నగర్‌లోని మాగుంట సుబ్బారామిరెడ్డి పార్కులో ఏర్పాటు చేసిన జీమ్ ఎక్విప్‌మెంట్ క్రీడా సామాగ్రి అభివృద్ధి పనులను అదికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2014-19 మధ్యలో తమ ప్రభుత్వ హయాంలో నగరంలోని అన్ని పార్కులను అద్భుతంగా తీర్చిదిద్దామని, అనంతరం వచ్చిన ప్రభుత్వం పార్కులను పట్టించుకోకపోవడంతో క్రీడా సామాగ్రి పరికరాలు పనికి రాకుండా మూలకు చేరాయని చెప్పారు. మళ్లీ ఇప్పుడు తమ ప్రభుత్వ హయాంలో నగరంలోని అన్ని పార్కులను అప్‌డేట్ చేసి అత్యాధునిక వసతులతో చిన్నారులకు ఆనందం, ఆహ్లాదం పంచే విధంగా తయారు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే పార్కుల్లో ఏర్పాటు చేసిన క్రీడా సామాగ్రితో చిన్నారులు ఆనందంగా కేరింతలు కొడుతూ ఆడుకోవడం మనసుకు చాలా సంతోషంగా ఉందని మంత్రి చెప్పారు. జూన్ 12 లోగా పాఠశాలలు ప్రారంభమయ్యే సమయానికి నగరంలోని అన్ని పార్కులను కూడా అత్యాధునిక సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి చెప్పారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో గ్రీన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పార్కులను అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి ఆదేశించారని, ఆ మేరకు చర్యలు చేపట్టినట్లు మంత్రి వివరించారు. నెల్లూరు నగరంలో భూగర్భడ్రైనేజీ, తాగునీటి కోసం ఈనెలాఖరు లోగా 165 కోట్లు రూపాయలను ప్రభుత్వం విడుదల చేయనుందని, ఆ మేరకు పనులు ప్రారంభించేందుకు సంబంధిత ఏజెన్సీ నిర్వాహకులతో కూడా మాట్లాడినట్లు చెప్పారు. ప్రజలకు అవసరమైన అన్ని పనులను పూర్తి చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని సందర్భంగా మంత్రి పునరుద్ఘాటించారు. మంత్రి వెంట కమీషనర్ సూర్య తేజ, కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

సహకారం ద్వారా సమృద్ధి

నెల్లూరు,కలెక్టరేట్, మార్చి 6, ప్రభాతవార్త జిల్లాలోని వ్యవసాయ, పాడి, మత్స్య సహకార సంఘాలను పటిష్టపరిచి సభ్యులకు మరింత మెరుగైన సేవలందించాల్సిందిగా జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ కోరారు. గురువారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. సహకార రంగం ద్వారా ఇప్పటివరకు సాధించిన అభివృద్ధిని జిల్లా సహకార శాఖ అధికారి గురప్ప వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విజన్ డాక్యుమెంట్లో సూచించిన విధంగా సహకారం ద్వారా సమృద్ధిస్ఫూర్తిగా సహకార సంఘాలను బలోపేతం చేయాలన్నారు. కంప్యూటరీకరించిన వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో మాన్యవల్ విధానం లో లావాదేవీలు నిర్వహించరాదని కేవలం ఆన్లైన్ ద్వారా మాత్రమే నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా పిఏసిఎస్ సంఘాలు కవర్ చేయని గ్రామపంచాయతీల్లో నూతనంగా బహుళ ప్రయోజన పిఏసిఎస్ సంఘాలు, పాడి, మత్స్య సహకార సంఘాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే అర్హత కలిగిన అన్ని పిఏసిఎస్‌లలో పెట్రోల్ బంకులు ఎల్పిజి గ్యాస్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా జిల్లాలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రధానమంత్రి జన ఔషధీ కేంద్రాల ఏర్పాటు కు చర్యలు తీసుకోవాలన్నారు. సహకార సంస్థలు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ఎలా సహాయపడతాయో తెలియజేసే విధంగా రూపొందించిన అంతర్జాతీయ సహకార సంవత్సరము 2025 కరపత్రాన్ని జిల్లా కలెక్టర్ ఇతర అధికారులతో కలసి ఆవిష్కరించారు.ఈ సమావేశంలో డిసిసి బ్యాంకు సీఈవో శ్రీనివాసరావు, నాబార్డ్ డీడీఎం డాక్టర్ బాబు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి, జిల్లా మత్స్య శాఖ అధికారి నాగేశ్వరరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం

నెల్లూరు క్రైమ్, మార్చి 6, ప్రభాతవార్త : అంతర్జాతీయ మహిళా దినోత్సవం 2025 వారోత్సవాలలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థినులతో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా యస్.పి. జి. కృష్ణ కాంత్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సిహెచ్. సౌజన్య, అడిషనల్ యస్.పి.(ఏఆర్) మునిరాజల అధ్వర్యంలో దాదాపు 200 మంది స్కూల్ విద్యార్థులతో ఈ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఉండే మెయిన్ గేట్ గార్డు నుండి, ఎస్‌పి చాంబర్, అడిషనల్ యస్.పి. చాంబర్, అన్ని సెక్షన్స్, ఐటి కోర్ టీం, సైబర్ టీం, ఏఆర్ హెడ్ క్వార్టర్ నందు పోలీస్ కంట్రోల్ రూమ్ లోని సిసి కెమెరాల పనితీరు, కమ్యునికేషన్ సెట్, డయల్ 112, ఎల్‌హెచ్ఎంఎస్, డాగ్ స్క్వాడ్ బృందాల పనితీరు, అన్ని ఆయుధాలు ఉంచే గది తదితర అన్ని విభాగాల పరికరాల పని తీరు, పోలీసు శాఖకు సంబంధించిన పలు విషయాలపై అవగాహన కల్పించారు. అదనపు ఎస్పి సిహెచ్ సౌజన్య మాట్లాడుతూ మంచి లక్ష్యంతో ఉన్నత స్థాయికి ఎదిగి, ప్రజలకు సేవలందించాలని కోరి, విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. ఓపెన్ హౌస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం పోలీసులకి మరియు ప్రజలకు మధ్య సత్సంబంధాలు నెలకొల్పడమేనని తెలిపారు. అంతేకాకుండా ఈ రోజు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పోలీసుల దైనందిన విధులపై ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా చట్టాలు, ఫోక్సో యాక్ట్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సామాజిక మాధ్యమాలు మరియు సైబర్ క్రైమ్స్ పై తీసుకోవలసిన జాగ్రత్తలు, తదితర అంశాలపై చైతన్యం కల్పించారు. స్వీయ రక్షణ మెళకువలు, మానసికంగా శారీరకంగా దృఢంగా ఉండేందుకు సూచనలు, నూతన చట్టాల పై అవగాహన, బాల్య వివాహాలు, పోలీస్ హెల్ప్ లైన్ , డయల్ 100/112 , ఉమెన్స్ సేఫ్టీ యాప్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ వెంకటరెడ్డి, ఆర్ఐ అడ్మిన్ శ్రీ హరిబాబు, ఆర్ఐ వెల్ఫేర్ శ్రీ రాజారావు, ఇతర పోలీసు అధికారులు, కంట్రోల్ రూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

శివాలయం హుండీ లెక్కింపు125279. రూపాయలు

కోవూరు, మార్చి 6 ప్రభాతవార్త కోవూరు లోని గాంధీ పార్క్ సెంటర్లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో గురువారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ అధికారుల సమక్షంలో చేపట్టారు ఈ లెక్కింపులో మొత్తం 1,25279 రూపాయలు రావడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య పొట్టే పాలెం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ అధికారి కెవిపి ప్రసాద్ రావు నవాబ్ పేట గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఎగ్జిక్యూటివ్ అధికారి పి శ్రీనివాసులు రాయజీ వీధి ఆంజనేయస్వామి దేవస్థాన ఎగ్జిక్యూటివ్ అధికారి పి సంపూర్ణమ్మ. కోవూరు గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఎగ్జిక్యూటివ్ అధికారి సిహెచ్ కృష్ణ ప్రసాద్ తదితరులు ఉన్నారు

అన్నదాతకు అండగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ

రాష్ట్ర వైసీపీ అధికార ప్రతినిధి ప్రసన్న కుమార్ రెడ్డి

కోవూరు, మార్చి 6, ప్రభాతవార్త ఆరుగాలాలు కష్టించి పనిచేసిన రైతాంగానికి పండించిన పంటకు మద్దతు ధరల కోసం గురువారం సాయంత్రం మాజీ మంత్రి వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి కోవూరు నియోజకవర్గానికి సంబంధించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులతో నెల్లూరు లోని తన నివాసంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది అన్నారు వైసీపీ ప్రభుత్వంలో రైతుల సంక్షేమానికి అప్పటి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు ఈ సందర్భంగా పలు విషయాలపై ప్రత్యేకంగా సమీక్షించారు

సోమశిల నీటిమట్టం

అనంతసాగరం, మార్చి6, ప్రభాతవార్త : మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం సాయంత్రానికి 0 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయంలో 57.342టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 350, ఎన్ఎఫ్‌సికి 650, పెన్నా డెల్టాకు 1950, కండలేరు వరద కాలువకు200 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 97.609 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దుతామని మంత్రి నారాయణ వెల్లడి

విద్య, సంక్షేమ వార్డు కార్యదర్శులతో సమీక్ష

నెల్లూరు కార్పొరేషన్,మార్చి 6 ప్రభాతవార్త: నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని 48 పాఠశాలలను అన్ని రకాలుగా బలోపేతం చేసి రాష్ట్రంలోనే మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు.గురువారం నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని విద్య, సంక్షేమ వార్డు కార్యదర్శులతో మంత్రి నారాయణ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు చేసే విధులు, వారి సమస్యలను ఆలకించి మరింత మెరుగ్గా ప్రజలకు సేవలందించేందుకు సూచనలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ నెల్లూరు సిటీ నియోజకవర్గంలో 34 ప్రాథమిక పాఠశాలలు, ఒక ప్రాథమికోన్నత పాఠశాల, 13 ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 48 పాఠశాలల్లోని 304 తరగతి గదుల్లో ఇంటరాక్టివ్ బోర్డులను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి తరగతికి ఒక ప్రత్యేక టీచరు ఉండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇంటరాక్టివ్ బోర్డుల ద్వారా విజువల్స్ తో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించుటకు ఉపాధ్యాయులకు తగిన శిక్షణ నిస్తామన్నారు. అలాగే అన్ని పాఠశాలల్లోని ఆట స్థలాలను ఆధునికరిస్తామని, అవసరమైన ఆట వస్తువులు, జిమ్ ఎక్విప్మెంట్ అందిస్తామన్నారు. అదేవిధంగా ప్రతి సచివాలయ విద్యా కార్యదర్శి తన పరిధిలోని పాఠశాలల్లో అవసరమైన వసతులు గురించి విచారించి, నివేదికలు ఇవ్వాలని సూచించారు.

రాజధాని నిర్మాణానికి రాష్ట్ర ప్రజల పన్నుల నిధులు ఖర్చు చేయం రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణాన్ని రాబోయే మూడు సంవత్సరాల్లో కచ్చితంగా పూర్తి చేస్తామన్నారు. ఇందుకు అవసరమైన విధులను వివిధ రకాల రుణాల ద్వారా సేకరిస్తామని, తిరిగి వాటిని రాజధాని భూమి విలువలతో తీర్చివేస్తామన్నారు. ఆ విధంగా రాజధాని నిర్మాణాన్ని సెల్ఫ్ ఫైనాన్సుడ్ ప్రాజెక్టుగా గతంలోనే తీర్చిదిద్దామన్నారు. రాష్ట్ర ప్రజలు వివిధ రకాల పన్నుల ద్వారా చెల్లించే మొత్తాలను రాజధాని నిర్మాణానికి వినియోగించమని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నాయకులు రాజధాని ఏర్పాటుపై చర్చిస్తామనటం హాస్యాస్పదమన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ, అడిషనల్ కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, జిల్లా విద్యా శాఖ అధికారి బాలాజీ రావు, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేసిన రాక్షసప్రభుత్వం ఇంటికిపోయింది..!

రైతుహితం కోసం శ్రమించే చంద్రబాబుపాలన వచ్చింది..!!

అసెంబ్లీలో కావలి ఎమ్మెల్యే దగుమాటి

కావలి, మార్చి 6 ప్రభాతవార్త రైతులను ఇబ్బందులకు గురిచేసిన రాక్షసప్రభుత్వాన్ని ప్రజలు ఇంటిబాటపట్టించారని, రైతుహితంకోసం నిరంతరం శ్రమించే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో మంచి ప్రభుత్వం వచ్చిందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. ఆంధ్రరాష్ట్రంలో నాడు-నేడు భవిష్యత్తులో ఇంకెప్పుడైనా రైతన్నలకు అండగా నిలిచే ఏకైక ప్రభుత్వం తెలుగుదేశంపార్టీ ప్రభుత్వం మనదేనని ఆయన తెలిపారు. రైతులను గత వైసిపి ప్రభుత్వం అన్ని విధాలా మోసం చేసిందన్నారు. దీంతో ఆంధ్రరాష్ట్రంలోని రైతన్నలు జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించేందుకు కంకణం కట్టుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో చంద్రబాబునాయుడు నాయకత్వంపై విశ్వాసంతో భారీస్థాయిలో కూటమి అభ్యర్థులైన తమను గెలిపించారన్నారు. వారికోసం కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటిసిఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ అన్ని విధాలుగా సహాయసహకారాలను అందిస్తున్నారన్నారు. నేడు మంచి ప్రభుత్వంలో వరివేసుకుని మంచి పంటలు వేసుకునే సమయంలో పిఏసియస్ ద్వారా రైతు సేవాకేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నారన్నారు. రైతన్నలకు గిట్టుబాటుధర కల్పించేందుకు సంబంధిత శాఖ మంత్రి పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ల్యాండ్ కన్వర్షన్ ద్వారా రెట్టింపుచార్జీలు చెల్లించి నష్టపోతున్న రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు అనుకూలంగా ఒకేసారి ల్యాండ్ కన్వర్షన్ ఫీజు ఉండేలా చేయాలని ఎమ్మెల్యే దగుమాటి తనదైనశైలిలో మాట్లాడారు. ఎమ్మెల్యే దగుమాటి సూచనలకు రెవిన్యూశాఖమంత్రి అనగాని సత్యప్రసాద్ స్పందించారు. తెలుగుదేశం ప్రభుత్వం రైతుల ప్రభుత్వమన్నారు. రైతులకు చంద్రబాబు నాయుడు ఎల్లవేళలా అండగా ఉంటారన్నారు. రైతుల పక్షపాతి చంద్రబాబునాయుడన్నారు.

వ్యవసాయ అనుబంధ శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలి

- జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ పిలుపు



నెల్లూరు కలెక్టరేట్, మార్చి 6,ప్రభాతవార్త గురువారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ 2025 అమలుపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో అమలు చేయాల్సిన కార్యక్రమాలను ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మాలకొండయ్య, జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించడంలో వ్యవసాయ శాఖ, డి ఆర్ డి ఏ అధికారులు కీలక భూమిక పోషించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు అవగాహన కల్పించి వారి ద్వారా భూమి సారవంతానికి అవసరమయ్యే నవధాన్య విత్తనాలను ఉత్పత్తి చేసి రైతులకు సరఫరా చేసేలా తోడ్పాటు అందించాలని రైతు సాధికార సంస్థ సభ్యులు, మండల వ్యవసాయ అధికారులు, ఏపీఎంలకు సూచించారు. ఎంత మేర విత్తనాల అవసరమో ముందుగా నిర్ధారించుకుని ఆ మేరకు మాత్రమే ఉత్పత్తిని చేయాలని సూచించారు. నవధాన్య విత్తనాల ద్వారా కలిగే భూమి సారవంతం, అధిక దిగుబడి, ఆరోగ్యకర పంటల ఉత్పత్తి మొదలైన ప్రయోజనాలను అన్నదాతలకు వివరించాలని సూచించారు. అలాగే పెరటి తోటల పెంపకంపై ఆసక్తిగల మహిళలను గుర్తించి వారికి అవసరమైన విత్తనాలు, సాంకేతిక సహకారాన్ని అందించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయానికి అవసరమయ్యే మట్టి పనులను ఉపాధి హామీ ద్వారా చేపట్టేందుకు వ్యవసాయ అధికారులు, ఏపీఎంలు ప్రత్యేక దృష్టి పెట్టాలని, అవసరమైన పనులను గుర్తించి నివేదిక పంపితే వెంటనే మంజూరు ఉత్తర్వులు ఇస్తామని చెప్పారు. ఉద్యానవన పంటల పెంపకానికి సబ్సిడీతో మొక్కలు ఇస్తున్నామని, ఆసక్తిగల రైతులు ముందుకు రావాలని కలెక్టర్ సూచించారు. మండల, స్థాయిలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ అమలుపై అవగాహన సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్య ప్రయోజనాలను ప్రజలకు, రైతులకు వివరించి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే లాభాలను తెలిపే పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రకృతి వ్యవసాయంలో ఉత్తమ ఫలితాలు సాధించిన రైతులు వరలక్ష్మి, కళావతి, సుబ్బమ్మ, రామ్మోహన్, వెంగల్ రెడ్డి ని జిల్లా కలెక్టర్ ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మాలకొండయ్య, జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, ఏపీఎంఐపి పిడి శ్రీనివాసులు, డిఆర్డిఏ, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ కేటాయింపుల్లో జరిగిన అన్యాయాలపై చంద్రశేఖర్ రెడ్డి

నెల్లూరు రూరల్, మార్చి 6, ప్రభాతవార్త బడ్జెట్‌లో ఉద్యోగులకు, పేద ప్రజలకు ఎలాంటి భరోసా దక్కలేదని..ఏపీ శాసనమండలిలో కూటమి ప్రభుత్వంపై నిప్పులు చేరిగిన ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి నేడు ఏపీ శాసనమండలి సమావేశాల్లో ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో .. అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందన్నారు. ముఖ్యంగా ఉద్యోగులకు ఎన్నికల సమయంలో పెద్ద ఎత్తున కూటమి నేతలు హామీలు గుప్పించారని.. అయితే ఈ రోజు బడ్జెట్ లో ఉద్యోగులకు ఎలాంటి నిధుల కేటాయింపులు జరపకుండా వారిని ప్రభుత్వం నిలువునా దగా చేసిందన్నారు. ఉద్యోగులకు ఇస్తామన్న ఐ,డీతి, అమలు చేయడంలో జాప్యం ఎందుకని..శిశిది అమలు చేసేందుకు.. కమిటీ వేస్తామని చెప్పి ఇప్పటివరకు కమిటీ వేస్తున్నట్లు ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకపోవడం ఉద్యోగులను మోసం చేయడమేనాన్నారు. కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా వైసీపీ ప్రభుత్వం.. ఐ, శిశిది, అమలుచేసి ఉద్యోగులకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం బడ్జెట్ లెక్కల్లో ఉద్యోగులకు సంబంధించిన చెల్లింపుల్లో 8 కోట్ల రూపాయలను తగ్గించి.. చూపించారని ఇది ఎలా సాధ్యమని.. ఉద్యోగులు కూడా దీనిపై అనుమానం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. దీతి, శిశిది బకాయిలు, శిన్నీ, తిశిబిలి, బకాయిలను క్లియర్ చేస్తామని.. ఎక్కడ బడ్జెట్ కేటాయింపుల లెక్కల్లో.. ఉద్యోగులకు ఎక్కడ హామీ దక్కలేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం బడ్జెట్లో మార్పులు చేసి ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు దిశగా.. చర్యలు చేపట్టాలని కోరారు అలాగే 2004 సెప్టెంబర్ ఒకటికి ముందు ఏపీలో 11 వేల మంది ఉద్యోగుల నియామకం జరిగిందని వారందరికీ కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం..దిశిళి రద్దు చేసి వీశిళి పెన్షన్స్ స్కీమ్ అమలు చేయాలని స్పీకర్ ద్వారా ప్రభుత్వాన్ని కోరారు.90 శాతం ప్రక్రియ పూర్తయిన 7 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను.. ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని కోరారు. వారిని రెగ్యులరైజ్ చేసినప్పటికీ ప్రభుత్వం మీద ఎలాంటి ఆర్థిక భారం పడదని.. గత ప్రభుత్వంలో వారి వేతనాలను కూడా వైయస్ జగన్మోహన్ రెడ్డి గారు గణనీయంగా పెంచారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగులను పట్టించుకోని వారిని.. రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలకు సంబంధించి.. ఆరు క్వార్టర్స్ బకాయిలు చెల్లించాల్సి ఉందని.. వాటిని తక్షణమే చెల్లించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈరోజు కూటమి ప్రభుత్వ చర్యలు మూలంగా వాలంటీర్లు అందరూ రోడ్డున పడ్డారని.. వారందరికీ నిరుద్యోగ భృతి అందించడం.. లేదా వారికి ఏదైనా ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆడబిడ్డ నిధి ఇస్తామని అటు మహిళలను కూడా ఈ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి .. ఆసరా చేయూత పథకాలతో.. మహిళలను ఆర్థికంగా ఆదుకున్నారని గుర్తు చేశారు. తక్షణమే కూటమి ప్రభుత్వం ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేసి.. మహిళలను ఆదుకోవాలని కోరారు. 202324 ఏడాదిలో వైఎస్ఆర్సిపి ప్రభుత్వం అన్ని పథకాలను అమలు చేసి కూడా..కేవలం 73 వేల కోట్ల రూపాయలు మాత్రమే అప్పులు చేస్తే..202425 సంవత్సరంలో కూటమి ప్రభుత్వం ఎలాంటి పథకాలు అమలు చేయకుండా 98 వేల కోట్ల రూపాయల అప్పులు చేసిందని ఆరోపించారు.అలాగే 202526 కు 1 లక్ష 4 వేల కోట్ల రూపాయల అప్పును బడ్జెట్లో చూపడం జరిగిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

గుడినరవ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ

ఉదయగిరి,మార్చి 6 ,ప్రభాతవార్త ఉదయగిరి మండల పరిధిలోని గుడి నరవ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆత్మకూరు ఆర్డీఓ పావని తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు.అనంతరం సచివాలయం వెల్నెస్ సెంటర్‌ను తనిఖీ చేశారు. సూచన సలహాలు ఇచ్చారు. తహశీల్దార్ సుభద్ర, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ జహీర్‌బాబు, రెవెన్యూ సిబ్బంది సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలిగిరిలో పూరిల్లు దగ్ధం

కలిగిరి మార్చి 6 ప్రభాతవార్త కలిగిరి లోని ఎర్ర తోట లో నాటక రాని రమణమ్మ అనే ఒంటరి మహిళ పూరిల్లు దగ్ధ దగ్ధమైంది . బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి 9 గంటల సమయంలోవంట చేసుకుని వేరే పనిమీద బయటకు వెళ్ళగా గురువారం రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో అస్మాత్తుగా మంటలు వచ్చి పూరిల్లు దగ్ధమైంది. ఈ క్రమంలో ఇంటిలో ఉన్న విలువైన సామాన్లు కాగితాలు కొంత రొక్కం, సుమారు 50 వేల రూపాయల పైగా ఆస్తి నష్టం జరిగినట్లు బాధితురాలు నాటక రాణిరమణమ్మ తెలిపారు. ఇల్లు కాలుటకు కారణం షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందని బాధితురాలుతెలిపారు .వంటి పైనబట్టలతో మిగిలిపోయిన బాధితురాలని ప్రభుత్వాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరుకుంటున్నారు .విషయం తెలుసుకున్న కలిగిరి పోలీసులు , విజమూరుఅగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

మండలంలోని సమస్యలపై జనవాణిలో వినతి

కలువాయి మార్చి 6 ప్రభాతవార్త కలువాయి మండలంలోని వెంకటరెడ్డిపల్లి నేషనల్ హైవేకి సమీపంలో రాజుపాళెం రోడ్డు సమస్యలతోపాటు మండలంలోని పలు ప్రాంతాలలో తాగునీటి సమస్యలను జనవాణిలో గురువారం వినతిపత్రం అందజేసినట్లు మండల జనసేన నాయకులు తెలిపారు. మంగళగిరిలోని జనసేనపార్టీ కార్యాలయం నందు నిర్వహించిన జనవాణిలో మండలంలోని సమస్యలపై వినతిపత్రం అందజేసి సమస్యల పరిష్కార దిశగా కృషి చేయాలని కోరినట్లు వారు తెలిపారు. ఈకార్యక్రమంలో మాలే హరిప్రసాద్, గ్రంధి సురేష్‌బాబు, మాలే పవన్, జల్లెల రాజేష్ తదితరులు ఉన్నారు.

స్కూడీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

బుచ్చి మార్చి 6 ప్రభాతవార్త బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని జెండాదిబ్బ రోడ్డు సెంటర్ వద్ద జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. రాజుపాళెం నుండి దువ్వూరు వైపు వెళుతున్న శివ అనే వ్యక్తిని స్కూటీ ఢీకొట్టడం జరిగింది. గాయాలైన ఆయనను స్థానికుల సమాచారం మేరకు నేషనల్ హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

లింగసముద్రం, మార్చి 6 ,ప్రభాతవార్త మండల కేంద్రమైన లింగసముద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నెల్లూరు సహాయ మలేరియా అధికారి వి.నాగార్జునరావు ఆకస్మిక తనిఖీ చేశారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన ఆయన ల్యాబ్, రికార్డులను తనిఖీ చేశారు. ల్యాబ్ టెక్నీషియన్స్ రక్త నమూనా పరీక్షలను సకాలంలో పరీక్షించి రోగులకు మంచి క్వాలిటీ ఫలితాలను త్వరితగతిన అందజేయాలని తెలియజేశారు. అనంతరం పెద్దపవని దగ్గర్లో గల ముత్యాలపాడు సచివాయలంలో జరుగుతున్నటువంటి ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని పరిశీలించి ఆరోగ్య కార్యకర్తలకు తగు సూచనలు, సలహాలు అందజేశారు.

రీ సర్వే గ్రామాన్ని పరిశీలించిన ఆర్డీఓ

ఉదయగిరి, మార్చి 6 ,ప్రభాతవార్త మండల పరిధిలోని రీ సర్వే జరిగిన గన్నేపల్లి గ్రామాన్ని ఆత్మకూరు ఆర్డీఓ బి.పావని గురువారం పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి వచ్చిన సర్వేయర్లతో రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం తమకు కుల దృవీకరణ పత్రాలు కావాలంటూ శాసనసభ్యులు కాకర్ల సురేష్‌కు వినతిపత్రం అందజేసిన మచి తెగకు చెందిన వారిని పిలిపించి వారి దగ్గర ఉన్న ఆధారాలు పరిశీలించారు. శాసనసభ్యులు చెప్పినట్లుగా విచారణ చేపట్టి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తమ సమస్యను పరిష్కరిస్తామంటూ హామీ ఇచ్చారు. ఆమె వెంట తహశీల్దార్ సుభద్ర సిబ్బంది ఉన్నారు.

గిరిప్రదక్షిణకు వచ్చే భక్తులకు అల్పాహారం ఏర్పాటు

బిట్రగుంట మార్చి 6 ప్రభాతవార్త బోగోలు మండలం కొండ బిట్రగుంట లో శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా రోడ్డు...విస్తిరణ కార్యక్రమాలు చేపట్టి,బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఏటువంటి ఇబ్బందులు కలగకుండా మునుపెన్నడూ లేనివిధంగా గిరి ప్రదక్షిణ సందర్భంగా ఈ నెల 9వ తేదీన సుమారుగా నాలుగు వేల మంది భక్తులకు అల్పాహార విందుకు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి నేతృత్వంలో స్వీకారం చుట్టారు,బ్రహ్మోత్సవాల కార్యక్రమాలు ఎమ్మెల్యే కృష్ణారెడ్డి పర్యవేక్షణలో జరగనున్నవి,బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఏటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆలయ అధికారులు ను ఎమ్మెల్యే ఆదేశించారు,ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలు ప్రసన్న వేంకటేశ్వర స్వామి భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దిష్టి బొమ్మ దగ్ధం

ముత్తుకూరు, మార్చి 6, ప్రభాతవార్త రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ పై అనుచిత వ్యాక్యాలు ఖం డిస్తూ గురువారం మండల కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి పైన ప్రజలు విసిగివేసారి కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారని రాష్ట్ర వ్యాప్తంగా జగన్మోహన్ రెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం చేసారని, ఇక నుంచి ఆయన జనాల్లో కూడా తిరగలేరని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు బొమ్మినేని వాణి భవాని, సంధూరి శ్రీహరి, అశోక్, ఎలికం గిరీష్, మస్తాన్, సుమన్, కిషోర్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 51.231 టీయంసీల నిటిమట్టం

కండలేరుద్యాం(రాపూరు),మార్చి6 ప్రభాతవార్త మండలంలోని కండలేరు జళాశయంలో గురువారం ఉదయానికి51.231 టీయంసీల నిటిమట్టం నమోదు అయినట్లు కండ లేరు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. జళశయంనుండి అవుట్‌ఫ్లోగా హెడ్ రెగ్యులేటర్ నుండి 835 క్యూసెక్కులు,లో లెవల్ స్లూయిస్ ద్వారా 110 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ ద్వారా 120 క్యూసెక్కుల చోప్పున మొత్తం 1065 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌తో టోయోటా లెజెండర్

నెల్లూరు,మార్చి6 ప్రభాతవార్త-విద్య అధిక పనితీరు, సాహషోపేతమైన ఎస్‌యూవీలకు పెరుగుతున్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని తమ సంస్థ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌తో లెజెండర్ 4బై4 ను ప్రవేశపెట్టడం జరిగిందని టొయోటా కిర్లోస్కర్ సేల్స్,సర్వీస్, యూజ్డ్‌కార్స్ బిజినెస్ ఉపాధ్యక్షులు వరిందర్ వాద్వా పేర్కొన్నారు.గురువారం నగరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు 2.8 లీటర్ల డీజిల్ ఇంజన్, ఆకట్టుకునే 204 పిఎస్‌శక్తిని 420 టార్క్‌నుఈ వాహనం అందిస్తుందన్నారు. ఆరు గేర్లు,సొగసైన పియానో బ్లాక్‌గ్రిల్, సిగ్నేచర్ ఎల్‌ఈడి లైటింగ్, వంటి అత్యాధునిక ఫీచర్‌ఇందులో ఉన్నాయన్నారు. ఎస్‌యూవి హద్దులను తాము అదిగమించేందుకు తాము ఈ నూతన 4బై4 వాహనాన్ని రూపొందించామని,దేశవ్యాప్తంగా నమ్మకమైన సర్వీసును అందించేందుక తమ సంస్థఎల్లప్పుడు కృషిచేస్తుందన్నారు. తమ వాహనాల విక్రయాల్లో ఇండియా ఉత్తమంగాఉంటుందని పేర్కొన్నారు. భారతీయుల అవసరాలకు, వారి ఆలోచనలకు అనుగుణంగా వాహనానలు తయారుచేసి ప్రజల మన్ననను అందుకున్నామని తమను ఆదరించాలని కోరారు. సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సరస్వతి పూజల

కోవూరు, మార్చి 6 ప్రభాతవార్త : కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో గురువారం పదవ తరగతి విద్యార్థులు సరస్వతి పూజా కార్యక్రమాలను పురోహితుని పర్యవేక్షణలో సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థినులు నూరుశాతం ఫలితాలు సాధించాలని ప్రధానోపాధ్యాయులు ఝాన్సీరాణి ఆకాంక్షించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు నృత్య రూపకాలు అలరింపజేశాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

నెల్లూరు,మార్చి6 ప్రభాతవార్త-విద్య సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస ్థలు(ఎంఎస్ఎంఈ) రు ణాలను లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని యూనియన్‌బ్యాంక్ జిఎం టి.కామేశ్వ రారవు పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని స్థానిక ఓ కళ్యాణమండపంలో యూనియన్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ఎంఎ స్ఎంఈ రుణాల మేళాలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని లబ్దిదారులకు బుణాలు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఎంఎస్ఎంఈ రుణాల మంజూరులో తమ బ్యాంక్ ఎల్లప్పుడు ముందు వరుసలో ఉంటుందన్నారు. నేటి యాంత్రిక సమాజంలో అరచేతిలో ఉండే సెల్‌ఫోన్ ద్వారా డిజిటల్ రుణాలు పొందే సౌలభ్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. అనంతరం ఎంఎస్ఎంఈ లోన్ పాయింట్ నెల్లూరు రీజినల్ హేడ్ శిరీష మాట్లాడుతు బ్యాంకులద్వారా రుణాలు పొందటం వాటిని సద్వినియోగం చేసుకోవటం వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణఅభివృద్ధి సంస్థ పిడీ నాగరాజకుమారి, మెప్మా పిడి.రాధమ్మ, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అబివృద్ధి పథంలో పడుగుపాడు సహకార సొసైటీ

కోవూరు, మార్చి 6 ప్రభాతవార్త : ఇనమడుగు గ్రామంలో పడుగుపాడు సహకార పం ాపతి సంఘం ద్వారా నిర్మాణం చేపడుతున్న పెట్రోల్ బంక్ పనులను గురువారం సివిల్ సప్లయిస్ మేన జింగ్ డైరెక్టర్ డాక్టర్ మంజీర్ జిలానీ సామూన్ పరిశీలించారు. అదే గ్రామంలో సొసైటీ ద్వారా ఉన్న రెండు గోదాములను కూడా పరిశీలించి సొసైటీ సీఈవో గోవర్ధన్‌రెడ్డితో ప్రత్యేకంగా మాట్లాడారు. సహకార సొసైటీలు ఈ విధంగా అభివృద్ధి పథంలో ముందంజలో ఉండడం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ పరిశీలనలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, జిల్లా సహకార శాఖ అధికారి గురప్ప, కోవూరు తహసీల్దార్ నిర్మలానందబాబా,ఏఎస్‌వో అంకయ్య, సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ బాలకోటమ్మ, ఉన్నారు.

నిల్వ మాంసం, చేపల విక్రయాలతో ప్రమాదంలో ప్రజారోగ్యం

ఉలవపాడు, మార్చి 6 ,ప్రభాతవార్త ఆరోగ్యవం తమైన జంతు, మాంసాలు, చేపలే విక్రయిస్తున్నారా..? అధికారులు అనుమతించిన మాంసాన్నే మనం కొంటున్నామా..? మనం తింటున్నది నాణ్యమైన చేపలు, మాంసమేనా..? జిల్లా, మండల కేంద్రాలతోపాటు గ్రామాల్లోనూ మాంసాహార ప్రియులను వేధిస్తున్న ప్రశ్నలివి.

ప్రజారోగ్యంతో చెలగాటంః మాంసం విక్రయాల వె నుక మోసం దాగి ఉన్నట్లు, నాసిరకం, అనారోగ్య జంతువుల మాంసాన్ని విక్రయం చేస్తన్నట్లు సమా చారం. ఐస్, ఫ్రీజర్లలో ఉంచిన చికెన్, మటన్, చేప లు, రొయ్యల నిల్వలను మరుసటి రోజు విక్రయి స్తూ స్థానిక హోటళ్లకు తరలిస్తున్నారనేది ఆరోపణ. ఇంత జరుగుతున్నా ఏ ఒక్కరూ చర్యలు తీసుకున్న దాఖాలు లేకపోవడంపై ప్రజాగ్రహం వ్యక్తం అవు తోంది. మాంసం, చేపల విక్రయాలపై నిఘా కరువైందని పంచాయతీ వెటర్నరీ విభాగాల అధికారుల మధ్య సమన్వయ లోపంతో నాసిరకం,నాణ్యత లోపించిన మాంసం చేపల విక్ర యాలు జోరుగా సాగుతున్నాయని అంటున్నారు. అధికారికంగా, అనధికారికంగా నిర్వహిస్తోన్న మాంసం, చేపల విక్రయ కేంద్రాల నిబంధనలు పాటించకుండా ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతు న్నామని ఆవేదన వ్యక్తం అవుతోంది. ఎక్కడ పడితే అక్కడ మురుగు కాలువలకు ఆనుకుని, రోడ్లు మీద, అపరిశుభ్రత పరిసరాల్లోనే చేపలు, మాం సం విక్రయాలు జరుగుతుండటంపై ఆగ్రహం వ్య క్తం అవుతోంది. ఆదివారం అయితే పరిస్థితి మ రింత దారుణంగా ఉంటుందని, అపరిశుభ్ర ప్రదే శాల్లో అమ్మకాలు చేయటం, అపరిశుభ్రతమైన నీటిలోనే మాంసాలను శుభ్రపరుస్తూ, అదే నీటిలో పదేపదే మాంసాలను ముంచుతూ విక్రయం చేస్తు న్నారని, దుకాణాల్లోనూ అపరిశుభ్రతమైన వాతావ రణమే ఉంటుందని అంటున్నారు.

తుంగలో తొక్కిన నిబంధనలుః అలాగే కిలో చికెన్ రూ.200 నుండి రూ.280, కిలో మటన్ రూ.900 నుంచి రూ.1000, చేపలు కిలో రూ.200 నుండి రూ.500ల వరకు అధిక ధరలకు విక్రయం చేస్తూ, తూనికలో సైతం మోసం చేస్తున్నారని వాపోతున్నారు. మిగులు మాంసాన్ని చేపలను నాసిరకం, వయస్సు మళ్లిన, అనారోగ్యంగా ఉన్న గొర్రెలు, మేకల నుంచి సేకరించిన మాంసాన్ని విక్రయిస్తూ ప్రజారోగ్యాన్ని తీవ్ర ప్రమాదంలోకి నెడుతు న్నారని ఆరోపిస్తున్నారు. అనుమతి ఉన్న దుకాణాల్లో మాత్రమే మాసం విక్రయాలు చేయాలని నిబంధ ్నలు చెబుతున్నా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న చికెన్, మటన్ సెంటర్లు అధికారికంగా ఎటువంటి అను మతులు లేకుండానే సాగుతున్నాయి. అలాగే పశువైద్య అధికారులు ఆరోగ్యకరమైనవి దృవీకరించిన జంతువులనే వధించి, ఆపై పంచాయతీ ముద్ర వేసిన మాంసాన్ని మాత్రమే విక్రయించాలనే నిబంధనలు ఉన్నా, అనారోగ్యంతో ఉన్న, వయస్సు మళ్లి నీరసించిపోయిన, చనిపోయిన కోళ్ళు, గొర్రెలు, మేకలు, పందులనే వధిసూ అధికారులు పరీక్షలు, అనుమతిలేని మాంసాలనే విక్రయం చేస్తున్నారు. ఎటువంటి పరిశీలనలు, అనుమతులు, తనిఖలు లేకుండా సాగుతున్న అనధికార, అపరిశుభ్రత అనారోగ్య కరమైన జంతు మాంసాలు, చేపలను క్రయం చేసి తినినందువలన ప్రజారోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని, తద్వారా డయేరియా, కలరా, బర్డ్ ఫ్లూ తదితర వ్యాధులు ప్రబలుతున్నాయని వైద్య, ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. నాసిరకం, నిల్వచేసిన, అనుమతిలేని మాంసం, చేపలు అనుమానం వస్తే పంచా యతీ, వెటర్నరీ వైద్యులకు సమాచారం ఇచ్చి, చర్యలు చేపట్టే వరకు వెనుకాడవద్దని సలహాయిస్తున్నారు.

నవాబుపేటలో మహిళాదినోత్సవ వారోత్సవ వేడుకలు

నవాబుపేట(రాపూరు),మార్చి6ప్రభాతవార్త మండల కేంద్రమైన రాపూరు పంచాయితీలో నవాబుపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సిడిపిఓ సునంధ ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ రాధిక మహిళా దినోత్సవ వారోత్సవ వేడుకలను నిర్వహిం చారు. ఆడబిడ్డల రక్షణకు వున్న చట్టాలు, ప్రమా దాలు సంబవించినప్పుడు ఎవ్వరిని సంప్రదించాలి అన్న విషయాలను వివరించారు. ప్రతి ఒక్కరు ఆడ బిడ్డలను బాగా చదివించాలని, వారికి 18 సంవత్సరాల వయస్సు నిండేవరకు వివాహం చేయరాదని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్త హెచ్.ఆధిలక్ష్మి, సహాయకురాలు విజయ,ప్రభుత్వ పాఠశాలఉపాధ్యాయినీసయ్యద్ అఫ్రష,పలువురు పిల్లల తల్లులు,గర్భవతులు,బాలింతలు తదితరులున్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యం

రాపూరు,మార్చి6ప్రభాతవార్త ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించమే లక్ష్యమని, అందుకు అవసరమైన మౌళిక వసతులు కల్పించేందుకు ప్రణాళికల రూపకల్పనకు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సిద్ధంగా వుందని రాపూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరిడెంట్ డాక్టర్ సరస్వతి తెలిపారు. గురువారం ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రోగులకు ఇచ్చే చికిత్స విషయంలో సూచనలు, రోగనిర్ధారణ మరియు పరిసరాల పరిశుభ్రత తదితర విషయాలపై చర్చించారు. గర్భిణీలకు ప్రసవం చేసే విషయంలో రాపూరు సామాజిక ఆరోగ్య కేంద్రం జిల్లాలో రెండవ స్థానంలో వుందని తెలిపారు. కమిటీ మెంబర్లు యం .గురుమూర్తి,డాక్టర్ గజరా వేణుగోపాల్, భవాని, ఇ.ప్రశాంతి, ధనలక్ష్మీ, మారుతమ్మ తదితరులున్నారు.

2025-26 గురుకుల పాఠశాలకు ధరఖాస్తులు

వెంకటాచలం,మార్చి 6,ప్రభాతవార్త: మహాత్మ జ్యోతిరావుపూలే వెనుకబడిన విద్యాలయా సంస్థ విజయవాడ, బాలాబాలికల పాఠశాల 2025-26 సంవత్సరానికి గల 5వ తరగతి ఇంగ్లీష్ మాద్యమవ స్టేట్ సిలబస్ బి.సి,ఎస్సీ,ఎస్టీ ,ఇ.బి.సి అభ్యర్థుల నుండి ప్రవేశానికి దరఖాస్తులు కోరడమైనదని జిల్లా గు రుకుల పాఠశాల కన్వీనర్ వి.వి రమణప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.ఉమ్మడి నెల్లూరు జిల్లా లోనే ఉన్న దొరవారిసత్రం(బాలురు)-80 సీట్లను,కోట (బాలురు)-80 సీట్లు, వెంకటగిరి(బాలురు)-40 సీట్లు,గిలగమూడి మత్స్యకారులు(బాలికలు) 80సీట్లు,గూడురు(బాలికలు)-40,నార్తుఆ ములూరు(బాలికలు)-40 ,మహ్మదావ్పురం/వెంకటాచలం(బాలురు)-40 సీట్లు,ఆత్మకూరు(బాలికలు)-40 సీట్లు కలవు, అర్హులైన వారు దరఖాస్తులను ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని జిల్లా కన్వీనర్ శ్రీ వి.వి రమణ ప్రసాద్ తెలిపారు.వయస్సు (ఒసి/బిసి)లకు 01-09-2014 నుండి 31-08-2016 మధ్య పుట్టి ఉండాలి.ఎస్సీ/ఎస్టీలకు వయస్సు 01-09-2013 నుండి 31-08-2016 మధ్య జన్మించి ఉండాలి.సంబంధిత జిల్లాలో 2023-24 అండ్ 2024-25 విద్యాసంవత్సరాలలో నిరవదికముగా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 3 మరియు 4 తరగతులు చదివివుండాలి.ఆదాయ పరిమితి అభ్యర్థి తల్లిదండ్రుల సంరక్షకుల సంవత్సర ఆదాయం రూ.1,00,000/- లకు మించి ఉండరాదు.ఆన్లైన్లో మీ యొక్క వివరాలను అప్లికేషన్లో పూర్తి చేసేటప్పుడు జాగ్రత్తగా చేయవలెఉ ముఖ్యంగా క్యాస్ట్ అండ్ డేట్ ఆఫ్ బర్త్ మరియు స్టూడెంట్ చది విన స్కూల్ రికార్డ్స్ ప్రకారం నింపాలి.5వ తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థి ఇంటర్మీడియట్ వరకు గురుకుల పాఠశాలలోనే విద్యను అభ్యసించవచ్చును.ఆన్లైన్లో ఈ వెబ్ సైట్ ద్వారా తేది 15-02-2025 నుండి 15-03-2025 వరకు అప్లై చేసుకోవలెను హెచ్‌టిటిపిఎస్://ఎమ్ఐపిఎఐ బిసిడబ్ల్యూ ఆర్ఈఐఎస్.ఎపిసిఎఫ్ఎస్ఎస్.ఐన్/ రూ.100/- ఆన్లైన్లో సమర్పించడానికి రుసుము వసూలు చేయబడుతుంది.పూర్తివివరాల కొరకు కింది ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు గొలగ బూడి -90008 66912,దొరవారి సత్రం- 986655 9644 ,కోట-98665 59643 ,గూ డురు -7601005960,నార్తు ఆములురు- 8309745625,వెం కటగిరి- 9441 624660,వెంకటాచలం-8317596367,ఆత్మకూరు-7780464107

మోచ కులస్తులకు న్యాయం చేస్తాం ఆత్మకూరు ఆర్డీఓ

ఉదయగిరి, మార్చి 6 ,ప్రభాతవార్త మండల కేంద్రమైన ఉదయగిరిలోని తహశీల్దార్ కార్యాలయం నందు మోచ కులస్తులతో ముఖాముఖి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మోచ కులస్తులకు కుల దృవీకరన పత్రాలు అందించడంలో న్యాయం చేస్తామని ఆత్మకూరు ఆర్డీఓ బి.పావని తెలిపారు. మోచ కొలతలు తమ పిల్లలు విద్య పరంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఆమె మోచ కులస్తులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించిన తర్వాత మీకు న్యాయం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది మోచ కులస్తులు సురేష్, ప్రసాద్, మహిళలు ఉన్నారు.

చర్చిలపై ప్రభుత్వ కక్ష పూరిత చర్యలను ఖండించండి

ఉలవపాడు ,మార్చి 6 ,ప్రభాతవార్త ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్చిలపై కక్ష పూరిత చర్యలను విడనాడాలని ఐఎఫ్‌టీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ ఆర్.మోహన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో గల ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఫిబ్రవరి 10వ తేదీన మెమో నెంబరు 27 12 16 4 విడుదల చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో ఎన్ని చర్చిలు ఉన్నాయి, ఎన్ని చర్చిల నిర్మాణానికి అనుమతులు ఉన్నాయి. విచారణ చేయాలని, అనుమతులు లేని చర్చిలపై చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. రాజ్యాంగం ప్రకారం అన్ని మతాలను రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం గౌరవించాలి, అలా కాకుండా ఒక మతం వారిపై కక్షపూరితంగా చర్యలు తీసుకోవడం సరైంది కాదని కామ్రేడ్ ఆర్.మోహన్ అభిప్రాయపడ్డారు. అందువలన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి మెనూ నెంబరు 27 12 16 4 ను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జనసేనపార్టీ ఆవిర్భావదినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

కావలి, మార్చి06 ప్రభాతవార్త జనసేనపార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కావలి నియోజకవర్గ జనసేనపార్టీ కార్యాలయంలో గురువారం పోస్టర్లను ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జనసేనపార్టీ ఆవిర్భావసభ మార్చి14వ తేది పిఠాపురంలో పండుగవాతావరణంలో జరిపేందుకు పార్టీ అధ్యక్షుడు ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నిర్ణయించారన్నారు. అందుచేత పోస్టర్‌ను ఆవిష్కరించడం జరిగిందన్నారు. జనసేనపార్టీ 21 మందికి 21 మంది ఎమ్మెల్యేలు గెలిచారన్నారు. నూరుశాతం రిజల్టు సాధించి గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు అన్నారు. ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన పవన్‌కళ్యాణ్ ఎంతో అభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. మార్చి 13వ తేది సాయంత్రం కావలి నుంచి పిఠాపురంకు బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కావలి నుండి అత్యధిక సంఖ్యలో ఆవిర్భావ దినోత్సవవేడుకల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కావలి పట్టణ వీరమహిళలు, వార్డుల అధ్యక్షులు, అల్లూరు, కావలిరూరల్, దగదర్తి, బోగోలు మండల అధ్యక్షులు మత్స్యకార కమిటిసభ్యులు, రాష్ట్రనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి తహశీల్దార్ ఆఫీసు ఆవరణలో వాహనాలు నిలిపివేత

ఉదయగిరి, మార్చి 6 ,ప్రభాతవార్త మండల కేంద్రమైన ఉదయగిరి తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో పలు ప్రభుత్వ కార్యాలకు వివిధ పనులపై వచ్చే వాహనదారులు కార్యాలయ ఆవరణంలో అడ్డ దిడ్డంగా వాహనాలను నిలిపి వేయడంతో పలువురు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంపై వాహన యజమానులు ఇరి ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారని ద్విచక్ర వాహనదారులు వాపోయారు. మేము పోయే దానికి కూడా దారి లేదని వారు అంటున్నారు, నిత్యం రద్దీగా ఉన్న కార్యాలయాల్లో ఇక్కడ మాత్రం వాహనాలు రద్దీగా ఉంటాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని వాహనాలు నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు.

సైదాపురంలో ఉచిత వైద్యశిబిరం

సైదాపురం, మార్చి 6 ,ప్రభాతవార్త : మండల కేంద్రమైన సైదాపురంలోని పంచాయతీ కార్యాలయంలో నెల్లూరు నారాయణ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య సలహా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు కావ్యశ్రీ, రేణుమౌనిక, అపూర్వ, ప్రత్యూషలు సుమారు 93మందికి కీళ్లు, ఎముకల వ్యాధి, కంటి వైద్యం, చెవిముక్కు, గొంతు వ్యాధి, శ్వాసకోస వ్యాధులపై పరీక్షలు నిర్వహించి చికిత్స చేసేందుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఎంపిక చేసిన వారిని నారాయణ హాస్పిటల్‌కు ఖచ్చితంగా వాహనం ద్వారా తీసుకెళ్లి వారికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి ఆపరేషన్, ఛార్జీలు, మందులు ఉచితంగా అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఓఏ ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ గ్రామీణ ఉపాధీ హామి పథకంపై సమీక్ష

సీతారామపురం మార్చి 6 ప్రభాతవార్త : మండలకేంద్రమైన సీతారామపురంలోని మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ గ్రామీణి ఉపాధీహామి పథకం పనులపై నిర్వహించే సామాజిక తనీఖి కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ బాస్కర్ మాట్లాడుతు 2023-2024 సంవత్సరానికి గాను మండలంలోని ఆయా గ్రామాలలో జాతీయ గ్రామీణ ఉపాధీ హామి పథకంలో 8 కోట్లా 35 లక్షల 69 వేలతో వివిధ పనులు జరిగినట్లు తెలిపారు. ఇందులో 6 కోట్లు 86 లక్షలు వేజ్ పేమెంట్ ఒక కోటి 49 లక్షలు మెటీరియల్ పేమెంట్ జరిగినట్లు వివరించారు. గ్రామాలలో చేపట్టిన పనులపై కూలీలకు చెల్లించిన డబ్బులపై సామాజిక తనీకి బృందం సభ్యులు పకడ్బందిగా తనీఖీలు నిర్వహించాలన్నారు. ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా నిఖచ్చిగా సామాజిక తనీఖి జరగాలని ఆయన సిబ్బందికి సూచించారు. తనీఖి సందర్భంగా గ్రామాలలో జరిగిన పనుల వివరాలను చెల్లించిన మొత్తంలో ఏమైనా తేడాలు ఉంటే సమగ్రంగా రికార్డులలో పొందుపరచాలన్నారు.ఈ సమావేశం ఏపిఒ సుభాషిణి,ఎస్ఆర్‌పి నీలకంఠం, తదితరులు పాల్గొన్నారు.

మహిళాచట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కావలిరూరల్, మార్చి06 ప్రభాతవార్త : సమాజంలో మహిళలచట్టాలపై అవగాహన పెంచుకుని రక్షణ పొందాలని కావలి లోక్‌అదాలత్ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి తెలియ చేశారు. కావలి పట్టణం వాయు నందన ప్రెస్‌వీధిలోని అంగన్‌వాడి కేంద్రాల సముదాయంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మహిళాచట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎం.మాలకొండారెడ్డి పాల్గొని మాట్లాడారు. మహిళలు అన్నిరంగాల్లో ఎదగాలని అలాగే ప్రతి వివాహాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకుని తద్వారా రక్షణ పొందాలని కోరారు. బాల్యవివాహాలు నివారించి ఆడపిల్లలకు 18 సంవత్సరాలు, యువకులకు 21 సంవత్సరాలు వచ్చిన తర్వాతనే వివాహాలు జరిపించాలని తెలియచేశారు. మహిళలకు ఆస్తిహక్కుచట్టం మరియు వరకట్నం నిషేధచట్టంపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. లోక్‌అదాలత్ ద్వారా ఉచిత న్యాయసలహాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళాపోలీసులు సౌమ్య, సుప్రియరెడ్డిలు మాట్లాడారు. బాలికలకు 1098, మహిళలకు 181 హెల్ప్‌లైన్‌ద్వారా రక్షణ పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి కార్యకర్తలు రాజ్యలక్ష్మి, పద్మ, లక్ష్మి, నాగమణి, మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొని మహిళాసాధికారతకొరకు నిరంతరం కృషిచేసి మహిళాభ్యుదయానికి కృషిచేయాలని తెలియచేశారు.

కార్యదర్శులకు,గ్రీన్ అంబాసిడర్లకు ఒక్క రోజు శిక్షణ

బుచ్చి మార్చి 6 ప్రభాతవార్త : జిల్లా పంచాయితీ అధికారి ఆదేశాల మేరకు కోడవలూరు మండలంలోని కొడవలూరు గ్రామ పంచాయితీలో గల లోకల్ ట్రైనింగ్ సెంటర్‌లో ఎంపిడిఒలు, విస్తరణాధికారులు, కార్యదర్శలకు, గ్రీన్ అంబాసిడర్లకు మరియు షెడ్డు మిత్రులకు ఒక్కరోజు శిక్షణ ఇవ్వడం జరిగింది. బుచ్చిరెడ్డిపాళెం మండలం వారికి సాయింత్రం 5 గంటలకు ఇవ్వడం జరిగింది. ఈకార్యక్రమంలో జిల్లా ముఖ్య కార్యనిర్వహణాధికారి విద్యారమ, బుచ్చిరెడ్డిపాళెం ఎంపిడిఒ శ్రీహరి,కొడవలూరు ఎంపిడిఒ సుబ్బారావు, విఒపిఆర్‌డి నారాయణరెడ్డి, నెల్లూరు డిపిఆర్ నుండి శ్రీనివాసులు, మండలంలోని అన్ని గ్రామ పంచాయితీల నుండి పంచాయతీ కార్యదర్శులు,గ్రీన్ అంబాసిడర్లు షెడ్డు మిత్రలు పాల్గొన్నారు.

మన్నంగిదిన్నె గ్రామంలో అక్రమమద్యం సరఫరాపై దాడులు

కావలి, మార్చి06 ప్రభాతవార్త : కావలి రూరల్ మండలం మన్నంగిదిన్నె గ్రామంలో చట్టవిరుద్ధంగా మద్యం అమ్ముతున్నవారిపై కావలి ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులు గురువారం ఆకస్మికదాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రావినూతల సాయి వద్ద ఉన్న 11 మద్యంబాటిళ్లను సీజ్‌చేశారు. అతనిపై కేసు నమోదుచేశారు. ఈ దాడుల్లో కావలి ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఎస్.శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించే చట్టం చేయాలి

ఉమెన్‌ఫోర్స్ మహిళా కన్వీనర్ చాకలికొండ శారద

కావలి, మార్చి06 ప్రభాతవార్త : అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా ఏళ్లతరబడి పెండింగ్‌లో ఉన్న మహిళారిజర్వేషన్ బిల్లును ఆమోదించి చట్టరూపంలోకి తీసుకురావాలని కావలి ఉమెన్‌ఫోర్స్ కన్వీనర్ వివిధ సంఘాల బాధ్యురాలు విశ్రాంత ప్రధానోపాధ్యాయిని చాకలికొండ శారద డిమాండ్ చేశారు. ఆమె గురువారం మాట్లాడారు. మార్చి 8వ తేది అంతర్జాతీయ మహిళాదినోత్సవం అని తెలిపారు. అయినా, చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించేచట్టం ఇంకాచేయకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి కాని మహిళల రిజర్వేషన్‌మాత్రం కల్పించడంలేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన 77యేళ్లకు రిపబ్లిక్ అయిన 68యేళ్లకు ఇచ్చినమాట తప్పుతూ వచ్చిన ప్రభుత్వాలను చూసి మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. మహిళాసాధికారత ఆసించి ఎదురుచూస్తున్న మహిళాలోకం కలలను సాకారం చేస్తూ ప్రస్తుత భారతప్రభుత్వం తక్షణమే చట్టసభల్లో 50శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం తీసుకురావాలన్నారు. అన్నిరాజకీయపార్టీలు నూరుశాతం బలపర్చి చట్టం తీసుకురావాలన్నారు. ప్రతిపార్టీ తమ అభ్యర్థుల్లో 50శాతం మహిళలకు టిక్కెట్లు కేటాయించి రిజర్వేషన్ కల్పించి చిత్తశుద్ధిని చాటిచెప్పాలన్నారు. మహిళలకు చట్టసభల్లో ప్రవేశంకల్పించి మహిళాసాధికారతకు పట్టంకట్టాలన్నారు. గృహసీమనుండి గగనతలందాక ఎదిగిన మహిళలకు చట్టసభల్లో 50శాతం స్థానం కల్పించడం అసాధ్యంకాదని నిజంచేసి చూపాలన్నారు.

యువత స్వశక్తితో ఎదగాలి

వింజమూరు, మార్చి 6 ,ప్రభాతవార్త : నేటి సమాజంలో యువత స్వశక్తితో ఎదగాలని విశ్రాంత డీఎంహెచ్ఓ ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు మాశిలామణి పేర్కొన్నారు. వింజమూరులోని గ్రంధాలయం సమీపంలో వీఎం ఆటో ఫైనాన్స్ కార్యాలయంను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాసిలామణి మాట్లాడుతూ నిర్వాహకులు వసంతకుమారి మోహన్‌రెడ్డిలు ఉన్నత చదువులు చదువుకుని వ్యాపార రంగంలో రాణించడం ఈ ప్రాంతంలో ఆటో ఫైనాన్స్ ఏర్పాటు చేయడం వాహన కొనుగోలుదారులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. వాహనదారులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. అనంతరం నిర్వాహకులు వసంతకుమారి మోహన్‌రెడ్డిలు మాట్లాడుతూ వీఎం ఆటో ఫైనాన్స్ పాత టూ వీలర్ త్రీ వీలర్ వాహనాలకు స్పాట్ ఫైనాన్స్ ఇవ్వబడుతుందన్నారు. అలాగే అన్ని రకాల రిజిస్ట్రేషన్స్ దస్తా వేజులు అగ్రిమెంట్లు అఫీడివిట్లు తయారు చేయబడ్డాయి. భూములు, ఇళ్లు, ప్లాట్లు, బ్యాంకు మార్టిగేజ్, సొసైటీ రిజిస్ట్రేషన్ దస్తావేజులు కూడా తయారు చేయబడతాయన్నారు. ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గణపం రమేష్‌రెడ్డి, రేవునూరి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి రాజారావు, అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, నీలం సంజీవరెడ్డి, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

10వ తరగతి పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలి సిఎసిఎల్ నేతలు

కావలి, మార్చి06 ప్రభాతవార్త : రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 17వ తేది జరిగే 10వ తరగతి పరీక్షలు సజావుగా రాసేవిధంగా అన్ని సౌకర్యాలు కల్పించాలని కాంపెయిన్ ఎగైనెస్ట్ ఛైల్డ్‌లేబర్ (సిఎసిఎల్) నెల్లూరుజిల్లా కన్వీనర్ మహ్మద్ అబ్దుల్ అలీం, స్వచ్ఛందసంస్థల నిర్వాహకులు షేక్. ఖాదర్‌బి, వినయ్‌కుమార్‌లు కోరారు. గురువారం కావలిలోని జిల్లా ఉపవిద్యాశాఖ అధికారి హరిప్రసాద్, మండల విద్యాశాఖ అధికారి వెంకటసుబ్బయ్యలు కలిసి మాట్లాడారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున పరీక్షలు నిర్వహించే సెంటర్లలో మంచినీటి సౌకర్యాలు ఏర్పాటుచేయాలన్నారు. పరిసరప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేవిధంగా చూడాలన్నారు. ముఖ్యంగా ప్రైవేటు విద్యాసంస్థల నిర్వాహకులను విద్యార్థులు చెల్లించాల్సిన ఫీజు బకాయిలు ఉన్నారని, విద్యార్థులకు ఇవ్వాల్సిన హాల్‌టికెట్లు ఇవ్వకుండా మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు ఫిర్యాదుచేశారు. అటువంటి విద్యాలయాలపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను పరీక్షలు రాయకుండా ఆపేహక్కు ఎవరికీ లేదన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు బకాయిలు విషయంలో వత్తిడి కలిగిస్తే బాగుండదన్నారు. బకాయిలు ఏదైనా ఉంటే టి.సి ఇచ్చే సమయంలో తల్లిదండ్రులవద్ద వసూలు చేసుకునే విధంగా చూడాలన్నారు.

కారును మోటార్ సైకిల్ డీకొని వ్యక్తికీ తీవ్ర గాయాలు

బిట్రగుంట మార్చి 6 ప్రభాతవార్త: బోగోలు మండలం నాగులవరం గ్రామానికి చెందిన పసుపులేటి వెంకబాబు నాగులవరం నుండి బోగోలుకు మోటార్ సైకిల్ పైనగురువారం వస్తూ బోగోలు నుండి ఎబికండ్రిక కు వెళుతున్న కారు ను డీకొనడంతో వెంకబాబు కు తీవ్ర గాయాలు అయినాయని బిట్రగుంట ఎస్ఐ భోజ్య నాయక్ తెలిపారు. తీవ్రంగా గాయపడిన వెంకబాబును మెరుగైన చికిత్స కోసం నెల్లూరు లోని ప్రైవేట్ హాస్పిటల్ కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయంగా అమ్మ చారిటబుల్ ట్రస్టు- దొడ్ల మల్లిఖార్జున

ఇందుకూరుపేట, మార్చి 6 , ప్రభాతవార్త : పేదరిక నిర్మూలనే ధ్యేయంగా అమ్మ చారిటబుల్ ట్రస్టు పని చేస్తుందని అమ్మ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు దొడ్ల మల్లిఖార్జున్ తెలిపారు. గురువారం అమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని ముదివర్తిపాలెం పాఠశాల నందు పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కూటమి నాయకులు సిఘాకొల్లు నాగరాజు, కైలాసం శ్రీనివాసులురెడ్డిలు విచ్చేసి విద్యార్థులకు పరీక్ష కిట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా అమ్మ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు దొడ్ల మల్లిఖార్జున్ మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్ఫూర్తితో అమ్మ చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మండలంలో అన్ని పాఠశాలలకు కలిపి 418 కిట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలియజేశారు. 590పైన మార్కులు సాధించిన విద్యార్థులకు 25 వేల రూపాయలు నగదు బహుమతిగా అందిస్తామని తెలిపారు. అనగారిన వర్గాలకు అమ్మ చారిటబుల్ ట్రస్టు ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేసినట్లు ఆయన తెలిపారు. భవిష్యత్తులో అమ్మ చారిటబుల్ ట్రస్టు ద్వారా ఎన్నో మంచి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సదానందం, అప్పాని శ్రీనివాసులు, రవి నాయుడు, ఇస్మాయిల్, నాగార్జున, ముసలి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

లింగసముద్రం, మార్చి 6 ,ప్రభాతవార్త : మండలంలోని తిమ్మారెడ్డిపల్లి ఏపీ మోల్ స్కూల్ విద్యార్థుల సైన్స్ ప్రాజెక్టులు జిల్లా ఇన్స్పైర్ మనక్ కార్యక్రమంలో జిల్లా స్థాయిలో ఎంపిక అయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ షేక్ మహమ్మద్ హప్తార్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం విద్యారుధలను, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. 10వ తరగతి విద్యార్థినీ పాలంకి లిఖిత, 8వ తరగతి విద్యార్థి పైడాల నవలోకేష్ జిల్లా స్థాయిలో వారి సైన్స్ ప్రాజెక్టులు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వారు ప్రాజెక్టులు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వారు ప్రాజెక్టులు రూపొందించడంలో గైడ్ టీచర్లుగా వ్యవహరించిన ఎన్.అన్నపూర్ణకి, ఎం.కళ్యాణికి కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దపవని, చిన్న పవని సచివాలయాలు తనిఖీ

లింగసముద్రం, మార్చి 6 ,ప్రభాతవార్త : మండలంలోని పెద్దపవని, చిన్న పవని సచివాలయాలను గురువారం ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయం రికార్డులను పరిశీలించారు. బుక్ సిబ్బంది అందరూ బయోమెట్రిక్ గుర్తించడం జరిగిందని అన్నారు. సచివాలయ సిబ్బంది చేత అన్ని సర్వేలు సకాలంలో పూర్తి చేయాల్సిందిగా ఆదేశించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి, వివిధ పనులపై సచివాలయాలకు వచ్చే వారికి సకాలంలో పనులు చేసేలా అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం పెద్దపవని గ్రామం నందు డంపింగ్ యార్డు నిర్వహణ కోసం 15వ ఆర్థిక సంఘం నిధులు నూతనంగా వేస్తున్న బోరును ఆయన ప్రారంభించారు.

గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ

లింగసముద్రం, మార్చి 6, ప్రభాతవార్త : మండలంలో 16 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 16 గ్రామ పంచాయతీల్లో 10 ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్లు చెత్త సంపద తయారీ కేంద్రాలుగా తయారై ఉన్నాయని ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు తెలిపారు. ప్రజలందరూ సహకరించి తడి చెత్త పొడి చెత్త తీసుకోవడానికి గ్రామాల్లో క్లాప్ మిత్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ క్లాప్ మిత్రలు సహకారంతో ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్‌కి తడి పొడి చెత్త చేర్చడం జరుగుతుందని మండలంలో ఆరు ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్లో రిపేరులో ఉన్నాయని, అవి కూడా త్వరలో అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. ట్రై సైకిల్స్ రిపేరకు గురయ్యాయని, వాటిని బాగు చేయిస్తామన్నారు. ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్లు నిర్వహించుటకు గాను కొండాపురం మండలం గొట్టిగుండా ల మార్చి 5న క్లాప్ మిత్రాలకు పంచాయతీ కార్యదర్శులకు ఈ వోపీఆర్డీలకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారని, ఈ శిక్షణ తరగతుల్లో పూర్తిగా తడి, పొడి చెత్త డంపింగ్ యార్డుకు తరలించి వేరు చేసి చెత్త నుండి సంపద తయారు చేయుట తెలుసుకున్నారని చెప్పారు.

ఉపముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి జగన్‌కు లేదు

వింజమూరు, మార్చి 6 ,ప్రభాతవార్త : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను విమర్శించే స్థాయి మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి లేదని జనసేన రాయలసీమ జోన్ కో కన్వీనర్ కమతం శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పవన్ కళ్యాణ్‌ని విమర్శించే స్థాయి మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి లేదని వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని చూసి రాష్ట్ర ప్రజలు ఒక్క సారి ముఖ్యమంత్రిని చేస్తే రాష్ట్రాన్ని సర్వనాశనం చేశావని అందుకోసమే ప్రజలు గత ఎన్నికల్లో నిన్ను నీ పార్టీని తిరస్కరించి 11 సీట్లకే పరిమితం చేశారని అయినా కూడా బుద్ధి రాలేదన్నారు. జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణన దేశ ఆజకీయాల్లో కీలకమైన వ్యక్తిగా ఉన్నారని, రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రం నిధులు తెచ్చి రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్నారని గిరిజన ప్రజల కోసం మన్యం ప్రాంతాల్లో తిరిగి ప్రజల కోసం పని చేస్తుంటే జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల సమస్యలు గాలికి వదిలేసి వర్క్ ఫ్రం హోం రాజకీయాలు చేస్తున్నారని మీరు ఎన్ని విమర్శలు చేసినా ప్రజలు మిమ్మల్ని విశ్వసించే పరిస్థితి లేదని మరో సారి పవన్ కళ్యాణ్‌ను విమర్శిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

హౌసింగ్ ఇండ్ల నిర్మాణంలో అవినీతి తిమింగలాల పై చర్యలు తీసుకోండి : మీదతల రమేష్

నెల్లూరు కలెక్టరేట్, మార్చి 6, ప్రభాతవార్త : గృహ నిర్మాణ శాఖలో అవినీతి అధికారుల నిగ్గు తేల్చేందుకు ముందుగా ఎండీ కార్యాలయాన్ని ప్రక్షాళన చేయాలని బిజెపి నమామి గంగ రాష్ట్ర కన్వీనర్ మిదతల రమేష్ గురువారం నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ ఉదయ్ భాస్కర్ కు అవినీతిని వివరిస్తూ వినతి పత్రాన్ని సమర్పించారు. గత ప్రభుత్వ హయాంలో అధికారులు కాంట్రాక్టర్లు కలిసి పేదల ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలిచ్చి కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారూని, 2022 సంవత్సరంలో విజిలెన్స్ అధికారులు నెల్లూరులో కోటి 59 లక్షలు అవినీతి జరిగిందని నివేదికలు సమర్పిస్తే ఎండి కార్యాలయంలో గత పాలకుల ఒత్తిడికి విజిలెన్స్ నివేదికను ఐదు లక్షలుగా మార్పు చేశారు. నిజాయితీగా పనిచేసిన అధికారులను గత ప్రభుత్వం హయంలో ఎండి కార్యాలయంలో వేధించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఎండి కార్యాలయంలో అదే అధికారులను కొనసాగిస్తూ ఉండడంతో భారీ అవినీతి చేసిన అధికారులపై చర్యలు లేకుండా పోయాయి అని వినతి పత్రం అందించారు.

దేవళ్ళ మురళికి ఎమ్మెల్సీ ఇవ్వాలి

కావలిరూరల్, మార్చి06 ప్రభాతవార్త : రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ మాజీ ఛైర్మన్, తెలుగుదేశంపార్టీ రాష్ట్రకార్యదర్శి దేవళ్ళ మురళికి ఎమ్మెల్సీ ఇవ్వాలని వడ్డెరసం క్షేమ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి బెల్లంకొండ శ్రీనివాస్, వడ్డెర సంక్షేమసంఘం నెల్లూరుజిల్లా కోఆర్డినేటర్ గుంజి నరేష్, కావలి నియోజకవర్గ వడ్డెరసంక్షేమసంఘం అధ్యక్షులు మల్లె సూర్యనారాయణ, జిల్లా వడ్డెరసంక్షేమసంఘం నాయకులు, న్యాయవాది ఇర్ల వెంకటరమణయ్యలు కోరారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడారు. వడ్డెరసంఘంలో రాష్ట్రవ్యాప్తంగా అటు వడ్డెరసంఘాన్ని ఇటు తెలుగుదేశంపార్టీని అభివృద్ధిపథంలో నడిపించిన ఏకైక నాయకుడు దేవళ్ళ మురళి అని తెలియచేశారు. దేవళ్ళ మురళి తెలుగుదేశంపార్టీకోసం ఎంతో కష్టపడ్డారని తెలియచేశారు. ఆయన కృషిని గుర్తించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వడ్డెరలకు కేటాయించే ఎమ్మెల్సీ సీటును దేవళ్ళ మురళికి ఇవ్వాలని పార్టీ అధిష్ఠానాన్ని కోరడం జరిగిందన్నారు. తెలుగుదేశంపార్టీ ప్రతిపక్షంలో ఉన్నపుడు 2019 నుంచి 2024 వరకు పార్టీ అభివృద్ధికోసం ఎంతో అభివృద్ధి చేశారని తెలియచేశారు. కర్నూలు జిల్లాలో జరిగిన ఉప ఎన్నికల్లో కీలకపాత్ర పోషించి వడ్డెరసంఘం ఓట్లు తెలుగుదేశంపార్టీకి పడేవిధంగా ఎంతో శ్రమించారని తెలియచేశారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నపుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్రమకేసులు బనాయిస్తున్న లెక్కచేయకుండా పార్టీ విధివిధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అప్పటి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంకుశప్రభుత్వానికి ఎదురొడ్డినిలబడ్డారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వడ్డెరసంఘంలో అత్యధికజనాభా తెలుగుదేశంపార్టీవైపు ఉన్నారంటే దానికి కారణం దేవళ్ళ మురళినేనని తెలియచేశారు. వడ్డెరకులంలో తెలుగుదేశంపార్టీలో కీలకనేతగా దేవళ్లమురళి వ్యవహరించారని ఇది రాష్ట్రవ్యాప్తంగా అందరికి తెలిసిన విషయమేనన్నారు. ఆయన పట్టుదల, కృషిని గుర్తించి ఎమ్మెల్సీ పదవిని ఆయనకే ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కోరడం జరిగిందని తెలియచేశారు.

విద్యార్థులకు విద్యతో పాటు మంచి అలవాట్లు, విలువలు నేర్పించాలి

ఉదయగిరి మార్చి 6 ,ప్రభాతవార్త : విద్యార్థులకు విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ నేర్పించడం అత్యంత ముఖ్యమైన విషయమని ఉదయగిరి మండల విద్యాధికారి 1 షేక్ మస్తాన్ వలి అన్నారు. గురువారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కొండాయపాలెం, వెంకటరావుపల్లి హెచ్‌డబ్ల్యూ పాఠశాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యాధికారి మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు మంచి అలవాట్లు, విలువలు నేర్పించాలని చిన్ననాటి నుండి వచ్చే అలవాట్లే పెరిగి గొప్ప అనే వారు అయ్యే కొద్ది అవే అలవాట్లు ఉంటాయని కావున విద్యార్థులకు ప్రతి రోజు పాఠశాలకు ప్రార్థన సమయానికి యూనిఫామ్‌తో వచ్చేటట్లు, స్నానం చేసేటట్లు, భోజన సమయంలో కాలకృత్యాలు తీర్చుకున్న తర్వాత శుభ్రంగా చేతులు కాళ్లు కడుక్కోవడం తదితర మంచి అలవాట్లను నేర్పిస్తూ అబద్దాలు చెప్పకుండుట, ఇతరుల వస్తువులను అపహరించకుండా ఉండుట వంటి విలువలు కూడా ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన చేయు సమయంలో పాఠ్యాంశాలకు అనుగుణంగా లేదా మధ్య మధ్యలో చెప్పాలని సూచించారు. విద్యార్థులు ఏకాగ్రత విని మంచి అలవాట్లు విలువలను నేర్చుకుంటారని తెలియజేశారు. అభ్యసన పఠన విషయాలలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి రెమిడియల్ టీచింగ్ చేపట్టాలని తెలియజేశారు.

గృహనిర్మాణాలకు అడ్డంకిగా మారిన కోళ్ల ఫారం

ఉదయగిరి, మార్చి 6, ప్రభాతవార్త : ఉదయగిరిలోని గండిపాలెం రోడ్డు చెర్కు రామయ్య నగర్‌లో ఉన్న ప్రైవేటు కోళ్ల ఫాం గృహ నిర్మాణాలకు ఆటంకిగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే దివంగత చెంచు రామయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు నిరుపేదలైన దళితులకు ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇప్పట్లో పంపిణీ చేశారు. అదే ప్రదేశంలో ఒక ప్రార్థన మందిరం కూడా నిర్మితమైన ప్రస్తుతం శరవేగంగా గృహ నిర్మాణాలు జోరందుకుంటున్నాయి. వారు ఉచితంగా ఇచ్చిన స్థలంలో పాటు కొనుగోలు చేసిన ప్లాట్లు కూడా నిర్మాణాలకు అనుకూలంగా ఉండటంతో నిర్మాణాలు కొనసాగుతున్నాయి. అయితే అతి సమీపంలో ఉన్న కోళ్ల ఆఫం వల్ల తాము గృహాలు నిర్మించుకున్నప్పటికి కుటుంబం అక్కడ ఉండలేదని దుర్వాధంతో ఈగలతో అలమటించవలసి వస్తుందని లబ్దిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేటటువంటి గోదాములు, కుటీర పరిశ్రమలు నివాస గృహాలు సమీపానికి వచ్చిన వెంటనే ఖాళీ చేసి సుదూర ప్రాంతంతో నిర్మించుకునే పరిస్థితి ఉంది. కానీ కోళ్ళ ఫాం మాత్రం అక్కడే తిష్ట వేసి ఉండటంతో నిరుపేదలు ఇల్లు నిర్మించుకోవడం కోసం వెనుకడుగు వేస్తున్నారని కోళ్ల ఫాం సమీపంలోని చుట్టు పరిసర ప్రాంతాల్లో దుర్వాధం వ్యాపిస్తుండటంతో అక్కడ నివాసం ఉండే పరిస్థితి వచ్చిందని అంటున్నారు. కోళ్ల ఫాం దగ్గరలోనే ఒక భోజన హోటల్ కూడా ఉండటం వల్ల వారు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారులు చొరువ చూపి కోళ్ల పాం యజమానితో మాట్లాడి వేరే చో

పార్కులను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచండి : కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు కార్పొరేషన్,మార్చి 6 ప్రభాతవార్త: నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని పార్కులలో బల్లలు, ఆట వస్తువులు, జిమ్ పరికరాలు, పచ్చదనం తదితర మౌలిక వసతులను కల్పించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ సూర్య తేజ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్య వేక్షణలో భాగంగా కమిషనర్ గురువారం 37వ డివిజన్ న్యూ మిలిటరీ కాలనీ, ఓల్డ్ మిలిటరీ కాలనీ, రామ్ నగర్ సిఎస్ఎస్ రోడ్డు తదితర ప్రాంతాలలో పర్యటించారు. ముందుగా పసల పెంచలయ్య మున్సిపల్ పార్కు, సోంపల్లి మహేష్ మున్సిపల్ పార్కులను సందర్శించారు. పార్కులలో ఆట వస్తువులు, జిమ్ పరికరాలు ఏవైతే పాడైన వాటిని తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయవలసినదిగా ఇంజనీరింగ్, హార్టికల్చర్ అధికారులకు సూచించారు. అలాగే నగరవ్యాప్తంగా అన్ని డివిజన్లలో ఉన్న పార్కుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నామని కమిషనర్ తెలియజేశారు. పార్కులలో లైటింగ్, సాయంత్రం పార్కు క్లోజ్ చేసిన తర్వాత వేళలలో పోలీసుల వారికి తెలియజేసి పెట్రోలింగ్ ఏర్పాటు చేయవలసిందిగా సూచించారు. డస్ట్ బిన్‌లు ఎక్కడైతే పాడై ఉన్నాయో వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని, చిన్న రిపేర్లు అయితే వెంటనే చేయించమని చెప్పి ఇంజనీరింగ్ అధికారులు ఆదేశించారు. మురుగు కాలువలలో సిల్ట్ తీసిన వెంటనే రోడ్లపై ఉంచకుండా మురుగు తొలగించేలా చర్యలు చేపట్టాలని హెల్త్ ఆఫీసర్ ను ఆదేశించారు. రోడ్డుపై ఉన్న సి అండ్ డి వేస్ట్ వెంటనే తొలగించవలసిందిగా టౌన్ ప్లానింగ్ సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. భవన నిర్మాణములో భాగంగా కాలువలలో కన్స్ట్రక్షన్ మెటీరియల్ వేసి నీటిపారుదలకు అంతరాయం కలిగించే భవన యజమానులకు నోటీసులు జారీ చేయాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు. డ్రైను కాలువల్లో మురుగునీరు పారుదలకు ఇబ్బందిగా ఉన్న దగ్గర ఐరన్ మెష్ ఏర్పాటు చేయవలసిందిగా ఇంజనీరింగ్ వారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ భానుశ్రీ, ఇంజనీరింగ్ విభాగం ఎస్. ఈ రామ్ మోహన్ రావు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, అడిషనల్ డైరెక్టర్ హార్టికల్చర్ ప్రదీప్‌కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషగిరిరావు, రెవిన్యూ ఆఫీసర్ ఇనాయతుల్ల, అధికారులు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

యర్రారెడ్డిపాలెం గ్రామస్తుల సమస్యను పరిష్కరించాలి

- అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే - కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు

లింగసముద్రం,మార్చి 6,ప్రభాత వార్త మండలంలోని యర్రారెడ్డిపాలెం గ్రామస్తులు గత కొన్ని సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యను కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు గురువారం అసెంబ్లీలో ప్రస్తావించారు.యర్రారెడ్డి పాలెం గ్రామస్తులు నివాసముంటున్న నివాసాలు గ్రేజింగ్ పోరంబోకు భూములోఉన్నాయి. దీనివల్లఎలాంటి రిజిస్ట్రేషన్లు గాని అమ్మకాలు గాని కొనుగోలు గాని జరగడం లేదు. ఈంతో పొజిషన్ సర్టిఫికేట్ తీసుకొని ప్రభుత్వం ఇచ్చిన పక్కా గృహాన్ని కట్టుకోవాలన్న సాధ్యపడటం లేదు. ఈ సమస్య గత కొన్ని సంవత్సరాల నుండి ఉన్నప్పటికి పరిష్కారానికి అటు పాలకులు గాని, ఇటు అధికారులు గానిఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల పరిష్కారానికి నోచుకోలేదు. దీంతో ఇటీవల గ్రామానికి వచ్చిన శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన అసెంబ్లీలో ప్రస్తావించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం అసెంబ్లీలో ఈ సమస్యను వివరించి తక్షణమే పరిష్కరించాలని రెవెన్యూ శాఖ మంత్రిని కోరారు. గత ఐదు నెలలుగా ఈ సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతున్న కొలిక్కి రాలేదని చెప్పారు. తమ సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్న శాసనసభ్యులు నాగేశ్వరరావుకు గ్రామ పార్టీ అధ్యక్షులు పొట్లపల్లి మాధవరావు, టీడీపీ నాయకులు రాజారపు మాలకొండయ్య, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా మండలంలోని పెద్దపవని గ్రామంలో అక్రమ రిజిస్ట్రేషన్ ద్వారా లక్షల రూపాయల విలువైన భూములను ఆక్రమించుకున్నారని, వెంటనే రిజిస్ట్రేషన్ రద్దు చేసి అందుకు సహకరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖ మంత్రిని కోరారు.

8న ఏపీ జి ఈ ఏ అద్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

నెల్లూరు కలెక్టరేట్, మార్చి 6, ప్రభాతవార్త ఈ నెల 8వ తేదీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఏపిజిఈఎ జిల్లా శాఖ సహకారంతో, మహిళా ఉద్యోగుల స్వచ్ఛంద భాగస్వామ్యంతో మహిళావిభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జరుగనున్నట్లు ఏపిజిఈఎ మహిళావిభాగం చైర్‌పర్సన్ సుజాతా బాయి, కన్వీనర్ సువర్ణ కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా దినోత్సవాలు ఇలా స్వచ్ఛందంగా నిర్వహించుకోవడం తిశిబినితి సంఘం ఏర్పడినప్పటి నుంచి ఉన్న ఆనవాయితీ అని, దానినే నేటికీ కొనసాగిస్తూ గత 6 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నట్లు పేర్కొంటూ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని శాఖల మరియు అన్ని స్థాయిల మహిళా ఉద్యోగులను ఆత్మీయంగా ఆహ్వానిస్తున్నట్లు వారు తెలిపారు. మార్చి 8వ తేదీ ఏపిఎస్ఆర్‌టిసి వద్ద గల శ్రీఏనుగు సుందరరామిరెడ్డి కల్యాణ మండపం నందు ఉదయం 10 గంటలనుండి సాయంత్రం వరకు ఈ వేడుకలు జరుగనున్నాయి. ఈ వేడుకలలో అన్ని శాఖల, అన్ని స్థాయిల మహిళా ఉద్యోగులు తప్పక పాల్గొనాలని వారు కోరారు.

అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్న టిప్పర్ సీజ్

దగదర్తి , మార్చి 6 ,ప్రభాతవార్త దగ దర్తి మండలం ఉలవపాళ్ళ గ్రామం నుండి అక్రమంగా ప్రతినిత్యం గ్రావెల్‌ను రియల్ఎస్టేట్‌కు తరలిస్తుండగా టిప్పర్‌ను గురువారం తహశీల్దార్ కృష్ణ సీజ్ చేశారు. అనంతరం గ్రావెల్‌తో ఉన్న టిప్పర్‌ను పోలీసులకు అప్పగించారు. గ్రావెల్ టిప్పర్‌ను సీజ్ చేస్తున్నారని విషయం తెలుసుకున్న గ్రావెల్ మాఫియా దారులు టిప్పర్లు జేసీబీలు వదిలి పరార్ అవ్వడంవిశేషం. నారాయణ పురం సున్నపుబట్టి ప్రాంతంలో కూడా రాత్రులు సమ యంలో గ్రావెల్‌ను తరలిస్తున్నారు. గ్రామ ప్రజలకు అవసరమైతే ఒక్క ట్రాక్టర్ తోలుకోవాలన్న అధికారులు నాయకులు పర్మిషన్ కావాలి, మరి ఈ గ్రావెల్ మాఫియా టిప్పర్ టిప్పర్లు మా గ్రామం నుంచి తరలించుకుపోవడం ఎంత వరకు సమంజసమని ప్రజలు వాపోతున్నారు. అధికారులు ఈ గ్రావెల్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

8 నుండి శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారి బ్రహ్మోత్సవాలు

బుచ్చి మార్చి 6 ప్రభాతవార్త బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పంచేడు గ్రామంలో కొలువైవున్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈనెల 8 నుండి ధర్మకర్త పెనాక ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. 8వ తేది అంకురారోపణ,9వ తేది ధ్వజా రోహణం, శేషవాహనం,10వ తేది చిలక వాహనం,11 వ తేది హనుమంతసేవ,12 గరుడసేవ,13 కళ్యాణం,14 రథోత్సవం,15 గుర్రపువాహనం, 16 ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.ఈ కార్యక్రమానికి భక్తులు పెద్దఎత్తున తరలిరావాలని ఆలయ ధర్మకర్త పెనాక ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు.

మెప్మా సిబ్బందికి చైర్‌పర్సన్ ప్రశంసలు

బుచ్చి మార్చి 6 ప్రభాతవార్త మహిళలను పొదుపు ఉద్యమంలో భాగస్వాములను చేసి మహిళా సాధికారతకు కృషి చేస్తున్న మెప్మా సంస్థ కృషిని చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ అభినందించారు. మెప్మా సంస్థ గిన్నీస్‌బుక్ రికార్డు సాధించి అంతర్జాతీయ గుర్తింపు సాధించడం అభిందనీయమని అన్నారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మెప్మాకి దక్కిన అరుదైన గుర్తింపు పట్ల చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మురళీతోపాటు కమీషనర్ బాలకృష్ణ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతు మహిళల జీవన ప్రమాణాలు మెరుగు పరచడంలో మెప్మా పాత్ర కీలకమన్నారు. ఈకార్యక్రమంలో మెప్మా సిఇఒ నర్మద, బుచ్చి పట్టణ ఆర్‌పిఐలు పాల్గొన్నారు.

సంక్రాంతి పోయినా బాగుపడని బుచ్చి- జెండాదిబ్బ రోడ్డు

బుచ్చి మార్చి 6 ప్రభాతవార్త ప్రభుత్వం సంక్రాంతికి రోడ్లన్ని వేస్తామని చెప్పడంతో ప్రజలు ఆనంద పడ్డారు.అయితే బుచ్చిరెడ్డిపాళెం ముంబాయి రహదారి నుండి జెండాదిబ్బ రోడ్డు కొద్ది దూరం బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీకి సంబందించి ఉంది.గత కొన్ని రోజుల క్రితం మంత్రుల వచ్చిన ప్పుడు మాత్రం గ్రావిల్ పోసి " మమా " అని పించారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి స్పందించి ఈరోడ్డు బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. ఈరోడ్డుపైన ద్విచక్ర వాహనదారులు అనేక సార్లు ప్రమాదాలకు గురైయ్యారు. ముంబాయి రోడ్డు నుండి టర్నింగ్ వరకు సిమెంట్ రోడ్డు వేయించాలని ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

అట్టహాసంగా మహిళా దినోత్సవం క్రీడ వేడుకలు ప్రారంభం

నెల్లూరు కలెక్టరేట్, మార్చి 6, ప్రభాతవార్త అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకొని ఏ పీ ఎన్ జీ జీ ఓస్ అసోసియేషన్ నెల్లూరు జిల్లా మహిళా విభాగం చైర్పర్సన్ ఉదయగిరి చిన్నమ్మ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం 2025 వేడుకలు ఏ సి సుబ్బా రెడ్డి స్టేడియంలో గురువారం నిర్వహించడం జరిగింది. ఈ దినోత్సవ వేడుకలను ఏపీ ఎన్‌జీజీఓస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ కర్నాటి వెంకట శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఆలపర్తి విద్యా సాగర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు సంవత్సరమంతా వారి వారి విధి నిర్వహణలో కుటుంబంలో మానసికంగా శారీరకంగా ఇబ్బంది పడకుండా మానసిక ప్రశాంతత ఉల్లాసం కోసం ప్రతి సంవత్సరం మహిళా ఉద్యోగులకు ఏ పీ ఎన్ జీ జీ ఓస్ అసోసియేషన్ తరపున ఆటల పోటీలు నిర్వహించడం చాలా మంచి సంప్రదాయమని నెల్లూరు జిల్లాలో ఎండను కూడా లెక్కచేయకుండా ఇంత అధిక సంఖ్యలో పాల్గొనడం సంతోషంగా ఉందని రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విసుజాత,అడిషనల్ జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఖాదర్వల్లి డి ఐ ఓ డాక్టర్ ఉమామహేశ్వరి సాంఘిక సంక్షేమశాఖ అధికారి కె శోభారాణి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జగదీష్ ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు నెల్లూరు జిల్లా ఎన్ జి ఓ నాయకులు మన్నేపల్లి పెంచలరావు,రామకృష్ణ, ఆంజ నేయ వర్మ, పెంచలయ్య, కృష్ణంరాజు, సతీష్ బాబు కరుణమ్మ రాజేంద్ర ప్రసాద్,విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ముఖ్యంగా మహిళాఉద్యోగులకు 6,7 తేదీలలో స్పెషల్ పర్మిషన్ ,8 వ తేదీన సెలవు మంజూరు చేసినందులకు కలెక్టర్ ఓఆనంద్‌కి జిల్లాశాఖ పక్షాన హృదయ పూర్వక అభినందనలు తెలిపారు.

సంగంలో రేషన్ షాపు పై విజిలెన్స్ అధికారుల దాడులు

సంగం మార్చి 6 ప్రభాతవార్త మండల కేంద్రమైన సంగంలోని రేషన్ దుకాణంపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. రేషన్ దుకాణంలో స్టాకు వివరాలు పరిశీలించారు. 3 వందల కేజిల బియ్యం,43 ప్యాకిలు చక్కర తగ్గడంతో 6 ఏ కేసు నమోదు చేశారు.

చంద్రబాబు బూటకపు వాగ్దానాలకు బలైయ్యామని బోరుమంటున్న ప్రజలు : మాజీ మంత్రి కాకాణి

పొదలకూరు, మార్చి 6, ప్రభాతవార్త అధికారంలోకి రావాలనే కుటంత్రంతో చంద్రబాబు నాయుడు అనేక బూటకపు వాగ్దానాలు చేసి ప్రజలను మోసం చేశారని ఇది గ్రహించిన ప్రజలు బలైయి పోయామంటూ బోరున విలపిస్తున్నారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆరోపించారు. చంద్రబాబు ప్రచారం మోత తప్పా, సంక్షేమ పథకాలకు కోతలు విధిస్తూ ప్రజలు వాతలు పెడుతున్నా రన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రజలకిచ్చిన వాగ్దానాలన్నింటిని పూర్తి చేసిన విషయాన్ని ప్రజలు ఇప్పుడు నెమరవేసుకుంటున్నారని ఆయన అన్నారు. అధికారంలోకి వచ్చాక ప్రజలకు మొండిచెయి చూపించి ప్రజలను తీవ్ర నిరాశలకు గురి చేసారని కాకాణి తనదైన శైలిలో విమర్శలను గుప్పించారు. మండలంలోని తాడిపర్తి గ్రామంలో బుధవారం కాకాణిపర్యటించారు.పంటలకు దిగుబడి తగ్గి పోయిందని ధరలు కూడా పడిపోయాయని అన్ని విధాలుగా నష్టపోయామని తన పర్యటనలో రైతులు వాపోయారన్నారు. ఇప్పుడు తాజాగా విచారణ పేరుతో అర్హులైన దివ్యాంగులకు పెన్షన్ తొలగించే కుట్ర జరుగుతుందని ఆయన దుయ్యపట్టారు. ఈ సందర్భంగా ఇటీవల మాజీ ఎంపిటిసి సభ్యులు హరి తల్లి మృతి చెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు..

- అక్రమ లేఅవుట్ల సొమ్ముతో విల్లాలు కొన్న మాట వాస్తవమా.. కాదా..

- కాణిపాకంలో ప్రమాణానికి సిద్ధమా..- సోమిరెడ్డికి కాకాణి సవాల్..

మండలంలోని తాడిపర్తి గ్రామంలో గురువారం మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పై భారీగా విరుచుకుపడ్డారు. సోమిరెడ్డి అభివృద్ధిని విస్మరించి అవినీతి అక్రమ సంపాదనే ధ్యేయంగా బ్రతుకుతున్నాడని అన్నారు. ఇటీవల వందకోట్ల ఇసుక దోపిడి వాస్తవమేనన్న విషయం బట్టబయళ్లు అయ్యిందని ఇటీవల ఇసుక రీచ్‌లో పట్టుబడిన బండ్లు ఇందుకు పరాకాష్ట అన్నారు. అక్రమ ఇసుకను తవ్విస్తున్న బండ్లను ఆపిన మైనింగ్ అధికారులపై కక్షకట్టి వారిని బెదిరించి వారిని బదిలీ చేసే ప్రయత్నాల్లో బిజీగా ఉన్నారన్నారు. అభివృద్ధి పనులు చేపట్టకపోగా గత ప్రభుత్వంలో మంజూరైన పనులకు కమీషన్లు దండుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డికి ఓ సవాల్‌కి సిద్ధమా అని ఆయన నిలదీసాడు. పొదలకూరులోని లేఔట్ యజమానుల దగ్గర మామూళ్లు దండుకుని తన కుమార్తెకి హైదారాబాదులో విల్లా కొనిచ్చిన మాట వాస్తవమా కాదా అని ప్రజలకు తెలియజేయాలన్నారు. సోమిరెడ్డి తాను లేఔట్‌ల దగ్గర డబ్బులు దండుకోకపోతే కాణిపాకం వినాయకుని దగ్గర ప్రమాణానికి సిద్ధంగా ఉండాలన్నారు. ప్రమాణం చేయడానికి ముందుకు రాకపోతే లేఔట్ల యజమానులు దగ్గర లంచాలు తీసుకున్నట్లు ఒప్పుకొని తీరాలన్నారు. సోమిరెడ్డి లాంటి అవినీతి పనులు శాసన సభ్యుడై దోపిడికి పాల్పడుతూ సర్వేపల్లి ప్రజలని విస్మరిస్తూ అక్రమ సంపాదనే ధ్యేయంగా వెంపర్లాడుతున్నాడు. ఇరిగేషన్ పనులు చేయకుండానే బిల్లులు స్వాహా చేసి రైతులను అడ్డం పెట్టుకుని దోచుకుంటున్నాడని ఇప్పటికైనా సోమిరెడ్డి నిజాయితీ నిరూపించుకోవాలంటే సవాల్‌కు సిద్ధమా అంటూ ఆయన మరో మారు నిలదీసారు. ఎవరు ఎన్ని మోసాలు, కుట్రలు చేసినా ప్రజలకు ఎల్లవేళలా తాను అందుబాటులో ఉంటూ ఎవ్వరికీ ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటానంటూ తెలియజేశారు. తాడిపర్తి గ్రామానికి పర్యటనకి విచ్చేసిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి గ్రామస్థులు బ్రహ్మరథం పట్టారు.

పవన్ కళ్యాణ్‌పై అవాక్కులు చెవాక్కులు పేలితే సహించం

- -జనసేన నగరఅధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు

నెల్లూరు,మార్చి6 ప్రభాతవార్త-విద్య తమ పార్టీ అధినేత,డిప్యూటీ సిఎం కొణిదల పవన్‌కళ్యాణ్‌పై అవాక్కులు చెవాక్కులు పేలితే సహించేది లేదని, జనసేన పార్టీ నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు పేర్కొన్నారు. గురువారం నగరంలోని స్థానిక మాగుంట లేఅవుట్‌లోని ఆ పార్టీ నగర కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా దుగ్గిశెట్టి మాట్లాడుతు జనసేనాని పవన్ గురించిమాట్లాడే అర్హత మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి లేదని హితవు పలికారు. గతంలో 151 స్థానాలతో పరిపాలించమని రాష్ట్ర ప్రజలు జగన్‌కు అవకాశం ఇస్తే ఇష్టానుసారంగా, పాలన సాగించి ప్రజా ఆగ్రహానికి గురై ప్రస్తుతం కేవలం 11 సీట్లకు పరిమితమైయ్యారని ఎద్దేవా చేశారు. ప్రజలను విస్మరించిన ప్రభుత్వాలుమనుగడ సాగించిన చరిత్ర లేదుఅనడానికి వైకాపా ప్రభుత్వమే ప్రత్య క్ష ఉదాహరణ అని తెలిపారు. ఇలాంటి నీతిమాలిన ఘనత జగన్‌కు తప్ప మరో నాయకుడికి లేదని, ప్రజలు గట్టి తీర్పుఇచ్చినా పులివెందుల ఎమ్మెల్యేకు బుద్ధి రాలేదన్నారు. గత ఎన్నికల్లో జగన్ ఓడి పోవడంతో మతిభ్రమించి ఉంటుందని, వెంటనే ఆయనకు వైద్య సేవలు అవసరమన్నారు. ఎన్నికల్లో ఓడిపోయి ప్రతిపక్ష హోదాకి కూడా అర్హత లేని తక్కువ సీట్టు సాధించి కూడా ప్రతిపక్ష హోదా ఇస్తే తప్ప సభకు వస్తామనిసాకులు చెబుతూ అడుక్కోవడం సిగ్గుచేటన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జనగ్ రాక్షస పాలన సాగించి ప్రజలకు నరకం చూపించారని, అటువంటి నీతిమాలిన వ్యక్తి తమ అధినేతపై నోటికొచ్చినట్లు మాట్లాడటం సరైం ది కాదన్నారు. జగన్ వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇలాంటి ఘటనలను మళ్లీ పునరావృతం అయితే జనసైనికుల ఆగ్రహానికి వైకాపా గురికాక తప్పదని హెచ్చరించారు. అనంతరం ప్లకార్డులను ప్రదర్శించినినాదాలు చేశారు .ఈ కార్యక్రమంలోపార్టీ జిల్లా కార్యదర్శి షేక్.ఆలియా,నగర ప్రదాన కార్యదర్శి అజయ్‌బాబు, నగర, రూరల్ ఇన్‌చార్జ్‌లు వావిళ్ల బాలాజీ, పవన్, బీమ య్య,నాయకులు శ్యామ్, ఊటుకూరు మహేష్, షఫీ, గురవయ్య, నాగూర్, సుమంత్, అనిల్‌కుమార్, లోకేష్, సిసింద్రీ,కోటేశ్వరరావు, సనత్, పాల్గొన్నారు.

సిఎన్‌జి వినియోగంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యం

నెల్లూరు,మార్చి6 ప్రభాతవార్త-విద్య సిఎన్‌జివాహనాలు వినియోగించటం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమౌతుందని జిల్లా విద్యాశాఖ అధికారి బాలాజీరావుపేర్కొన్నారు.ఎజిఅండ్ పి ప్రథమ్ సంస్థ, ధింక్ గ్యాస్ సంస్థల ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక, పర్యావరణ అనుకూల రవాణా అనే అంశంపై జిల్లాలోని విద్యాసంస్థలు, కళాశాలల యాజమాన్యాలతో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు .పాఠశాలల నిర్వాహకులు సిఎన్‌జి వాహనానలు వినియోగించటం ద్వారా ఖర్చు ఆదా చేయవచ్చని అలాగే పర్యావరణానికి హితవు అని తెలిపారు. పాఠశాలల రవాణాను సిఎన్‌జి వైకుపు మల్లించేందుకు ధింక్ గ్యాస్ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. అందరూ దీనిని ఆదరించాలన్నారు.నెల్లూరు,చిత్తూరు జిల్లాల ధింక్‌గ్యాస్ ప్రాంతీయ జిఎ గౌతమ్ ఆనంద్ మాట్లాడుతు ప్రభుత్వ సంస్థలు, ప్రయివేటు విద్యాసంస్థలు, ఆటొమెటివ్ తయారీ దారులుఅందరూ సిఎన్‌జిని ఆదరించాలన్నారు. పెట్రో, డీజిల్‌తో పోలిస్తే45శాతం ఇందనాన్ని ఆదా చేయవచ్చన్నారు. వినియోగ దారులకు మెరుగైన సేవలు అందిచేందుకు తమ సంస్థ రాష్ట్రంతోపాటూ రెండు జిల్లాల్లో మరింత విస్తృతం కానుందన్నారు. ప్రస్తుతం శ్రీసిటీ, గాజులమండ్యం, హిందూపురం, తిరుపతి, పుట్టపర్తి, అతివరం, మాంబట్టు, రేణిగుంట, శ్రీకాళహస్తి, తోట్టంబేడు, మేనకూరు వంటి పారిశ్రామిక వాడల్లో సేవలను విస్తృతం చేస్తున్నామన్నారు.రాష్ట్రంలో 10వేల కోట్ల పెట్టుబడులను పెట్టడం ద్వారా అందరికి మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషిచేస్తున్నామన్నారు.అందరూ తమను ఆదరించాలన్నారు.జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి, డిప్యూటీ డిఈఓ ఎస్‌వినాయక్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలి

- ధాన్యం విషయంలో నిధుల కొరత లేదు

కోవూరు, మార్చి 6 ప్రభాతవార్త : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ఇప్పుడిప్పుడే ప్రారంభం అవుతున్నాయని, రైతులుచ పండించిన పంటకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర వచ్చేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని సివిల్ సప్లయిస్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మంజీర్ జిలానీ సామూన్ అన్నారు. కోవూరు మండలం పాటూరు , ఇనమడుగు, రైతు సేవా కేంద్రాల్లో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం జాయింట్ కలెక్టర్ కార్తీక్‌తో కలిసి ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతు సేవా కేంద్రంలో ఉన్న ఉద్యోగులతోనూ , రైతులతోనూ ప్రత్యేకంగా మాట్లాడారు. అసలు రైతు సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు రైతులకు ఏ విధంగా సేవలు అందిస్తారు.. తేమ శాతాన్ని ఏ విధంగా పరిశీలిస్తారు.. షెడ్యూలింగ్ సక్రమంగా చేస్తున్నారా లేదా అనే విషయాలను ఆయన ఉద్యోగులను ప్రశ్నించి అడిగి తెలుసుకున్నారు. రైతులు పండించిన ధాన్యంలో తేమశాతం 17 ఉంటే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర తప్పనిసరిగా వస్తుందన్నారు. జిల్లాలో సుమారు 10 లక్షల మెట్రిక్ టన్నులు ఈ సీజన్‌లో వస్తాయని వ్యవసాయ శాఖ అంచనాలు వేసిందన్నారు. ప్రస్తుతానికి 300 మెట్రిక్ టన్నులు మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించడం జరిగిందన్నారు.

– మిల్లర్లు, రైతులతో ప్రత్యేక సమావేశం రైతులు మిల్లర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి తేలికపాటి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా జాయింట్ కలెక్టర్ కార్తీక్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఈ సందర్భంగా సివిల్ సప్లయిస్ ఎండీ సూచించారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు కేంద్రానికి సంబంధించి వ్యవసాయ , సివిల్ సప్లయిస్ , సహకార శాఖలు ప్రత్యేకంగా సమన్వయం చేసుకుని ముందుకు సాగాలన్నారు. రైతు సేవా కేంద్రంలో ధాన్యానికి వేసిన తేమ శాతం కరెక్ట్ అని, దాని ద్వారానే రైతుకు నిధులు రావాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. రైతులు కూడా కొనుగోలు కేంద్రంలో పనిచేస్తున్న ఉద్యోగులకు సహకరించి తద్వారా ముందుకు సాగాలన్నారు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల్లో ఉన్న గన్నీ బ్యాగ్స్ ఆశించిన మేర బాగాలేవని, మంచి గన్నీ బ్యాగ్స్ పంపాలని ఈ సందర్భంగా ఆయన మిల్లర్లకు సూచించారు. ఈ సందర్భంగా పలువురు మిల్లర్లు ధాన్యం వచ్చిన తర్వాత దానిని ఆరబెట్టేందుకు పుట్టికి రూ. 500 వరకు అవుతుందని, ఈ నిధులు ప్రభుత్వం నుంచి తమకు అందేలా చూడాలని మిల్లర్ అసోసియేషన్ నాయకులు ఎండీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైయర్ చార్జీలు మిల్లర్లకు ప్రభుత్వం ద్వారా వస్తాయని ఈ ఆరబెట్టిన కూలీ డబ్బులు మాత్రం రావన్నారు. రైతులను